PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 143 విజయవాడ, మంగళవారం 26 డిసెంబర్ 2023 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No Vijayawada, Tuesday 26 December 2023 Rs

సమస్యలు పరిష్కరించకుంటే

సమ్మె మరింత ఉధృతం

- రేపు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు వినతులు
- అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్లు

2

6

రోహిత్ సేన సాధించేనా..

- నేటి నుంచి దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

పవిత్రభూమిలో పనికిమాలిన యుద్ధం

- క్రిస్మస్ సందేశంలో గాజాపై ఇజ్రాయిల్ దాడులను విమర్శించిన పోప్

5

బైజూస్ ట్యాబ్‌ల స్కామ్

రూ. 1,250 కోట్లు పక్కదారి

- విచారణ జరిపించాలని వి శ్రీనివాసరావు డిమాండ్
- అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి : వై వెంకటేశ్వరరావు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో వై వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన బైజూస్ ట్యాబుల్లో భారీ కుంభకోణం జరిగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. ట్యాబులు, అందులోని కంటెంట్ కొనుగోళ్లలో రూ.1,250 కోట్లు దుర్వినియోగం జరిగిందని తెలిపారు. ఈ నిధులు ఎవరి చేతుల్లోకి వెళ్లాయో, ఎవరు తిన్నారో రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మైటాస్ కుంభకోణం తరహాలో బైజూస్ కుంభకోణం ఉందన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండేళ్లలో 9,52,925 ట్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయగా, గతేడాది 5,18,745, ఈ ఏడాది 4,34,185 చొప్పున ట్యాబులు కొనుగోలు చేసిందని వివరించారు. గతేడాది శాంసంగ్ ఎ7 అనే మోడల్ గల ట్యాబు అమెజాన్ వెబ్‌సైట్‌లో కంపెనీనే రూ.11,999లకు అమ్ముతుంటే, రాష్ట్ర ప్రభుత్వం రూ.13,262లకు కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. కానీ హోల్‌సెల్ ధర రూ.9వేలు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఒక్కో ట్యాబ్‌ను రూ.4 వేలు వెచ్చించి అదనంగా కొనుగోలు చేశారని తెలిపారు. ఈ ఏడాది ఏసర్ 1 మోడల్ ట్యాబును రూ.17,500లకు కొనుగోలు చేశారని, మార్కెట్‌లో ఇది రూ.14వేలకు మించి లేదన్నారు. హోల్‌సేల్‌లో రూ.12 వేలే ఉంటుందని తెలిపారు. ట్యాబుల కొనుగోళ్లలో రూ.250 కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఈ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కంటెంట్ కొనుగోలులో రూ.1000 కోట్ల కుంభకోణం

ట్యాబుల కొనుగోళ్ల కంటే అతిపెద్ద కుంభకోణం కంటెంట్ అని తెలిపారు. ప్రతి ట్యాబ్‌కు బైజూస్ కంటెంట్‌కు లైసెన్స్ కింద రూ.15,500లు వసూలు చేస్తున్నారని, ఇది రూ.5 వేల కంటే మించదని తెలిపారు. 8వ తరగతి విద్యార్థికి ఇచ్చిన కంటెంట్ వచ్చే ఏడాదికి ఉపయోగపడదని, మరలా కొనుగోలు చేయాలని వివరించారు. బైజూస్ మూతపడితే కంటెంట్ మొత్తాన్ని మార్చాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే ఈ కంపెనీ దివాళా తీసే స్థితికి వచ్చిందని, మోసాలకు పాల్పడి అప్పులపాలైందని, ఫారెన్ ఎక్స్చేంజ్ కుంభకోణంలో విచారణను ఎదుర్కొంటుందని తెలిపారు. 20వేల మంది సిబ్బంది ఉంటే 12వేల మందిని కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించిందని, ముగ్గురు డైరెక్టర్లు రాజీనామా చేశారని వివరించారు. బైజూస్ వంటి వాళ్లను ఉద్ధరించడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌సిఇఆర్‌టికి సంబంధించిన దీక్ష యాప్‌ను మూలనపడేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జాయింట్ ప్రాజెక్టుగా ఉన్న ఎన్‌పిటిఎల్‌ను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఒక వైపు ప్రపంచ మేధావులను తయారు చేస్తామని చెబుతూ మరోవైపు ఎలాంటి అవకాశాలు ఇవ్వకుండా మన మేధావితనాన్ని తొక్కిపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

40 వేల టీచర్ పోస్టులకు ఎసరు

బైజూస్ తీసుకొచ్చి ప్రపంచ బ్యాంక్ సలహాతో 40 వేల టీచర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయడం లేదని, ఇది పెద్ద నష్టమన్నారు. రాష్ట్రంలో టీచర్ పోస్టులు 40 వేల ఖాళీలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఖాళీలు 800, 4 వేలు, 5వేలు మాత్రమే అంటూ రోజుకోమాట మారుస్తుందని తెలిపారు. బైజూస్‌ను ఉద్ధరించడం కోసం 40 వేల పోస్టులను తగ్గించి ట్రైనింగ్ పొందిన నిరుద్యోగ యువతను ప్రభుత్వం బలిచేస్తోందని పేర్కొన్నారు. ఉన్న టీచర్లపై రకరకాల భారాలు వేస్తూ వేధింపులకు గురిచేస్తోందని, కనీసం బోధన చేయనివ్వడం లేదని, వేతనాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆత్మహత్యలకు పాల్పడే విధంగా చేస్తున్నారని తెలిపారు. ప్రవీణ్ ప్రకాష్ తనలాంటి వాళ్లను మండలానికి ఒక్కరిని తయారు చేశారని చెప్పారు. అధికారులపై ప్రవీణ్ ప్రకాష్ ఒత్తిడి చేయడంతో వారు ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఒక పథకం ప్రకారం మూసేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నాడు-నేడు వంటి పథకాలు నాణ్యత పెంచలేదన్నారు.

ల్యాబులు పెట్టండి

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ల్యాబులు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్యాబుల వల్ల పిల్లలు ఇంటివద్ద పబ్జీ వంటి ఆటలు ఆడటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి మాత్రం అబద్ధపు ప్రచారం అంటూ కొట్టిపారేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులతో చర్చించకుండా సిఎం ఇలా అనడం సరికాదని చెప్పారు. పాఠశాలల్లో స్క్రీన్ల ద్వారా మిగతా 2లో

ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కేందుకే..

- ఎంపిల సస్పెన్షన్‌పై ఉపరాష్ట్రపతికి ఖర్గే లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి, పార్లమెంటరీ పద్ధతులను విధ్వంసం చేయడానికి, రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి ఎంపిల సస్పెన్షన్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఈ మేరకు, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌కు లేఖ రాశారు. ధనఖర్ గత వారం తనకు రాసిన లేఖకు బదులుగా సోమవారం ఖర్గే లేఖ రాశారు. ధనఖర్ రాసిన లేఖ దురదృష్టవశాత్తు పార్లమెంట్ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న "నిరంకుశ, దురహంకార వైఖరిని" సమర్థిస్తోందని పేర్కొన్నారు. తన ఆందోళనను నిష్పక్షపాతంగా, తటస్థంగా పరిశీలించాలని ధన్‌ఖర్‌ను కోరారు. "ప్రివిలేజ్ మోషన్లు కూడా ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి ఆయుధంగా ప్రభుత్వం చేసుకుంది. ఎంపిలను సస్పెండ్ చేయడంతో 146 మంది ఎంపిలకు ఓటు వేసిన ఓటర్ల గొంతును ప్రభుత్వం అణగదొక్కుతోంది" అని ఖర్గే పేర్కొన్నారు. సభ ముందుకు సాగాల్సిన అవసరం ఉందనే వాదనతో తాను ఏకీభవిస్తున్నానని, సభను నడపడానికి ప్రభుత్వం ఆసక్తి చూపకపోతే ఛైర్మన్ ఛాంబర్‌లో చర్చించడం అర్థరహితమని ఖర్గే అన్నారు. పార్లమెంటు నుంచి ప్రతిపక్ష ఎంపిలను సామూహికంగా సస్పెండ్ చేయడం ప్రభుత్వం ముందే నిర్ణయించినట్లుగా కనిపిస్తోందని ఆయన అన్నారు. "ఆ రోజు సమావేశానికి హాజరుకాని ఒక ఎంపిని కూడా సస్పెండ్ చేయడం అందుకు ఉదాహరణ" అని తెలిపారు. "సభా వేదికపై ప్రకటన చేయడానికి ఇష్టపడని హోం మంత్రి, ప్రభుత్వ వైఖరిని సభాపతి క్షమించడం విచారకరం" అని పేర్కొన్నారు.

పులివెందులో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సిఎం జగన్

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

- క్రిస్మస్ వేడుకల్లో సిఎం జగన్

2

పేటిఎం ఉద్యోగులు వెయ్యిమందిపై వేటు

ముంబయి : ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేటిఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ ఉద్యోగులను భారీగా ఇంటికి పంపించింది. పేటిఎంలో పనిచేస్తున్న దాదాపు 1,000 మంది ఉద్యోగులపై వేటు వేసింది. ఇది మొత్తం ఉద్యోగుల్లో 10-15 శాతం మందిపై ప్రభావితం చూపనుందని సమాచారం. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా సిబ్బందిని ఇంటికి పంపించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. పేటిఎం తన వ్యాపారాలను పునర్ వ్యవస్థీకరించాలనే ఉద్దేశంతో కోతలు విధించినట్లు ఆ సంస్థ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల రిటైల్ రుణాల జారీని తగ్గించుకోవడం, యుపిఐ ప్లాట్‌ఫామ్‌పై 'ఇప్పుడు కొనండి... తర్వాత చెల్లించండి' రుణాలను నిలిపివేయడం వంటి చర్యల తర్వాత సిబ్బంది తొలగింపు నిర్ణయం వెలుపడింది. గతేడాది వ్యవధిలో భారీ వృద్ధి నమోదు చేసిన రుణ విభాగం నుంచే అత్యధిక తొలగింపులు ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది తొలి మూడు త్రైమాసికాల్లో వివిధ నూతన టెక్ కంపెనీలు దాదాపు 28 వేల మంది ఉద్యోగులను తొలగించాయని లాంగౌజ్ కన్సల్టెంగ్ పరిశోధన సంస్థ అంచనా వేసింది.

అదానీ కోసం... శారదా నదిపై పిఎస్‌పి

- రహస్యంగా మట్టి నమూనాల సేకరణ
- రైవాడ జలాశయానికి దెబ్బ
- ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌ను అదానీ ప్రదేశ్‌గా మార్చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశలో మరోసారి ప్రజా ప్రయోజనాలను తుంగలో తొక్కడానికి సిద్ధమౌతోంది. అదానీ అక్రమాలకు ఈ సారి రైవాడ జలాశయం బలికానుంది. ఫలితంగా ఆ జలాశయంపై ఆధారపడి బతుకులీడుస్తున్న ప్రజానీకం మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది. రైవాడ జలాశయానికి ఎదరయ్యే ముప్పు గురించి సాక్షాత్తు రాష్ట్ర జలవనరులశాఖే సవివరమైన నివేదికను సిద్ధం చేసినా ప్రభుత్వ పెద్దలు మాత్రం అదానీ వైపే మొగ్గుచూపినట్లు తెలిసింది. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ బలిపురం వద్ద మట్టి నమూనాలు తీయడంతో మరో పిఎస్‌పి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రైవాడ జలాశయానికి వచ్చే శారద నదిపై పిఎస్‌పి ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అదానీ గ్రూపు వివిధ సర్వేలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా బలిపురం వద్ద మట్టి నమూనాలు తీసి, నివేదించే బాధ్యతను కొల్‌కతాకు చెందిన ఓ సంస్థకు అప్పగించినట్లు తెలిసింది. బలిపురం నుంచి విజయనగరం జిల్లా వేపాడ మండలం, ఈలుపర్తి పంచాయతీలోని మారికకొండ మధ్య 60 అడుగుల లోతులో 20 చోట్ల మట్టి నమూనాలు తీయనునున్నట్లు తెలిసింది. బలిపురం, మారికకొండ మధ్య శారద నది ఉంది. ఈ నది నీరు రైవాడ జలాశయానికి ప్రధాన నీటి వనరు. దీంతో రైవాడ జలాశయ ఉనికి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే ఏజెన్సీలోని చింతపల్లి మండలం యర్రవరంలో శ్రీ షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, అనంతగిరి మండలం పెదకోట వద్ద అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పిఎస్‌పిలను అదానీకి అప్పజెప్పేందుకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. యర్రవరం పిఎస్‌పి వల్ల తాండవ, పెదకోట పిఎస్‌పి వల్ల రైవాడ జలాశయానికి వచ్చే నీటి వనరులు దెబ్బ తింటాయని జలవనరుల శాఖ కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. పిఎస్‌పిల ఏర్పాటుపై మిగతా 2లో

బలిపురం వద్ద తీస్తున్న మట్టి నమూనా

ఆయకట్టుకు, తాగునీటికి దెబ్బ

రైవాడ జలాశయానికి శారద నది, పెదకోట ప్రాంతం నుంచి వచ్చే నీటి వనరులే ప్రధానం. ఈ వనరు లను పవర్ ప్రాజెక్టులకు కేటాయిస్తే రైవాడ జలాశయం నిరుపయోగంగా మారనుంది. ఆయకట్టు రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయి. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) ప్రజలకు తాగునీరు సరఫరా చేసే అవకాశం భవిష్యత్తులో ఉండదు. జలాశయం నీటి వనరులను దెబ్బతీసే ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వొద్దు.

-డి.వెంకన్న, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత నాలుగేళ్లుగా మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎందురుచూస్తున్నారు. ప్రభుత్వ పెద్దలకు వినతులు సమర్పించినా పరిష్కారం కాలేదు. వినతులు, అభ్యర్థనలతో విసిగిపోయిన కార్మికులు మంగళవారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. 'ఒక సంవత్సరం ఓపిక పట్టండి.. ప్రభుత్వం వచ్చిన తరువాత సమస్యలను పరిష్కరిస్తాం' అని పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చినా, ఇప్పటికీ సమస్యలను పరిష్కరించలేదు. సమాన పనికి సమాన వేతనం ఇస్తానని చెప్పిన మాట సిఎం గాలికొదిలేశారు. కార్మికశాఖ ప్రతిపాదనలు మేరకు జిఓ 30 ప్రకారం వాటర్ సప్లయ్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, చైన్ దళం తదితర 8 కేటగిరిలకు వేతనాలు పెంచుతామని మూడేళ్లుగా హామీలతోనే సరిపెట్టేస్తున్నారు. చెత్తను తరలించే వాహన డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మలేరియా, పార్కుల్లో పనిచేసే వారికి హెల్త్ అలవెన్స్ ఇప్పటికీ చెల్లించడం లేదు. సర్టిఫికెట్స్ లేవనే సాకుతో గత 10-15 ఏళ్లగా నైపుణ్యంతో కూడిన విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం దగా చేస్తుంది. మున్సిపాల్టీల్లో రోజుకు 12 గంటల వరకు పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు జిఓ 7ను అమలు చేయడం లేదు. క్లాప్ డ్రైవర్లకు నెలకు రూ.18,500 చెల్లించాలని జిఓలో పేర్కొన్నా... దళారులు రూ.9 వేల నుంచి రూ.13 వేలు చెల్లిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని సంబంధిత మంత్రులు హామీ ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు కెవిపిఎస్ మద్దతు

మున్సిపల్ కార్మికులు చేపట్టబోయే సమ్మెకు కెవిపిఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. వారి సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతను వీడి తక్షణం చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి సోమవారం వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులకు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో

దళిత యువకుడు మృతి

- హత్య? ప్రమాదమా? అనే కోణంలో దర్యాప్తు

ప్రజాశక్తి- కొవ్వూరు, చాగల్లు

ఓ దళిత యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి శివారులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... వ్యవసాయ కూలి పనులు చేసుకునే జొన్నకూటి విజయేంద్ర, ఇంద్ర చాగల్లు మండలం చంద్రవరం నుంచి వలస వచ్చి కొవ్వూరు మండలం వాడపల్లిలో ఉంటున్నారు. తాపీ పనిచేసుకుంటూ ఉపాధి పొందుతున్న వారి నాల్గో కుమారుడు జొన్నకూటి లక్ష్మణ్ (23) ఆదివారం సాయంత్రం బయలు చంద్రవరంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. రాత్రి పది గంటల వరకూ స్నేహితులతో గడిపారు. ఆయన సోదరుడు కిషోర్ ఫోన్ చేయడంతో కాసేపట్లో బయలుదేరి వస్తానని చెప్పారు. ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు తిరిగి ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. సోమవారం ఉదయం వాడపల్లిలోని మద్ది సత్యనారాయణ పొలంలో విగత జీవిగా లక్ష్మణ్ పడి ఉన్నారు. ఆయన ద్విచక్ర వాహనం పొలం గట్టుపై పడిపోయి కన్పించింది. లక్ష్మణ్ మేనమామ ఆనంద్‌కు పొలం యజమాని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. పోలీసు జాగిలం సమీపంలో పాకవద్దకు వెళ్లి ఆగింది. పోలీసులు ఈ పాకలో మద్యం సీసాలను గుర్తించారు. మద్యం సేవించింది ఎవరనేదీ విచారణ చేశారు. స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. లక్ష్మణ్ సోదరుడి ఫిర్యాదు మేరకు ఆరుగురు అనుమానితులను గుర్తించారు. ఇది హత్య? ప్రమాదమా? అనే కోణంలో విచారణ చేపట్టారు. కొవ్వూరు సిఐ జగదీశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జొన్నకూటి లక్ష్మణ్

మృతుని కుటుంబానికి కెవిపిఎస్ పరామర్శ

ఘటనా స్థలానికి సోమవారం వచ్చిన కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, అనుమానితులపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

4 వేలు దాటిన యాక్టివ్ కేసులు

న్యూఢిల్లీ : దేశంలో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటల నుండి సోమవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల వ్యవధిలో 312 కొత్త కేసులు వెలుగు చూసినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 3,742 నుంచి 4,054కు పెరిగింది. అలాగే సబ్‌వేరియంట్ జెఎన్1 కేసుల సంఖ్య 63కు చేరుకుందని తెలిపింది. గోవాలో ఈ సబ్‌వేరియంట్ కేసులు అత్యధికంగా 34 కేసులు వెలుగుచూశాయి. మహారాష్ట్రలో ఈ కేసులు 9 నమోదుకాగా, థానేలోనే 5 కేసులు నమోదయ్యాయి. ఈ వేరియంట్ సోకినవారిలో స్వల్ప లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయని, బాధితులు త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మొత్తం కేసుల్లో కేరళలో అత్యధికంగా 128 కేసులు నమోదు కాగా, ఒకరు మరణించినట్లు అధికారులు తెలిపారు. దేశంలో మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసుల సంఖ్య 0.01 శాతం మాత్రమేనని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. అదేవిధంగా రికవరీ రేటు 98.81 శాతం, మరణాలు 1.18 శాతంగా ఉన్నాయని తెలిపింది. గత 24 గంటల్లో 315 మంది కొవిడ్ నుంచి కోలుకున్నారు. ఈ వైరస్‌తో మరణించిన వారి సంఖ్య 5,33,033కి చేరింది.

'అనంత' రైతు కన్నీటి మంట

- ఆయకట్టుకు నీరందక దిక్కుతోచని మిర్చి రైతు
- కౌలు భూముల్లోనూ బోర్లు వేసి పంటను కాపాడే యత్నం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మిర్చి సాగు చేస్తున్న రైతుల కంట కన్నీటి మంటలొస్తున్నాయి. పంట ఏపుగా వచ్చి దిగుబడులొచ్చే సమయంలో ఆయకట్టుకు నీరు బంద్ అయింది. దీంతో, పంటను వదులుకోలేక కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. కౌలు భూముల్లో సైతం లక్షలాది రూపాయలు వెచ్చించి సొంతంగా బోర్లు వేసుకున్న వారు కొందరైతే, ట్యాంకర్ల ద్వారా పంటను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న వారు మరికొందరు. ఏటా మాదిరిగానే జనవరి వరకు ఆయకట్టుకు నీరందుతుందని ఆశించి అనంతపురం జిల్లాలో 62 వేల ఎకరాల్లో మిర్చి వేశారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, మిడ్‌పెన్నార్ ఉత్తర కాలువ కింద బొమ్మనహాల్, విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, పెద్దవడు గూరు మండలాల్లో ఈ పంట ఎక్కువగా సాగవుతోంది. జూన్‌లో వేసిన పంట జనవరి ఆఖరుకు పూర్తవుతుంది. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ఇప్పటికే లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఈ తరుణంలో డిసెంబర్ ఒకటి నుంచి కాలువలకు నీటి సరఫరా ఆగిపోయింది. ఏడాదికి కౌలుకు తీసుకున్న భూముల్లోనూ మిర్చి పంటను కాపాడుకోవడానికి కౌలు రైతులు ఇప్పుడు బోర్లు వేస్తున్నారు. పెద్దవడుగూరు మండలంలో ఈ రకంగా మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ పరిధిలోని పెద్దవడు గూరు, చిన్నవడుగూరు, మిడుతూరు, దిమ్మగుడి గ్రామాల్లో గత 40 రోజుల్లో 200కుపైగా బోర్లు వేశారు.

పూత, పిందె దశలో ఉన్న మిర్చి పంట

అసలు సమస్య

అనంతపురం జిల్లాకు సాగునీటిని అందించే తుంగభద్ర డ్యామ్ నుంచి సాధారణంగా జులై నుంచి జనవరి ఆఖరు వరకైనా నీరొచ్చేది. ఈ ఏడాది తుంగభద్ర ఎగువ ప్రాంతాల్లో వర్షాభావంతో డ్యామ్‌కు 114 టిఎంసిల నీరు మాత్రమే వచ్చింది. అంతకు మునుపు ఏడాది 602 టిఎంసిల నీరు వచ్చినట్లు రికార్డులు మిగతా 2లో

తమిళనాడు వరద పరిస్థితిపై స్టాలిన్‌తో మోడీ సంభాషణ

న్యూఢిల్లీ : తమిళనాడులో వరద పరిస్థితిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోన్ ద్వారా సంభాషించారు. తమిళనాడుకు కేంద్రం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తిరునెల్వేలి, తూత్తుకుడి, కన్యాకుమారి జిల్లాల్లో పరిస్థితి గురించి ప్రధానంగా మోడీ ఆరా తీశారు. తమిళనాడులో వరద పరిస్థితిని అంచనా వేయడానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను నియమించినట్లు ప్రధాని తమిళనాడు సిఎం స్టాలిన్‌కు తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన సహాయ, పునరావాస కార్యక్రమాలు గురించి మోడీకి స్టాలిన్ వివరించారు. మోడీ, స్టాలిన్ మధ్య ఫోన్ సంభాషణ గురించి ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) అధికారులు మీడియాకు వెల్లడించారు. తమిళనాడులో పరిస్థితిని సమీక్షించడానికి, ఇలాంటి సమయంలో రాష్ట్రానికి మద్దతు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ అత్యున్నత స్థాయి అధికారుల సమావేశం కూడా జరిగిందని పిఎంఒ వెల్లడించింది.

తెలంగాణ సిఎంతో చిరంజీవి భేటీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి భేటీ అయ్యారు. సోమవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసానికి వచ్చిన ఆయన రేవంత్ రెడ్డితో అరగంట సేపు సమావేశమయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేశారని, కాంగ్రెస్ క్యాడర్‌లో విశ్వాసం తీసుకొచ్చారని చిరంజీవి అన్నారు. పార్టీ నాయకులందరినీ కలుపుకుని ఎన్నికల్లో గొప్ప విజయం సాధించినందుకు రేవంత్ రెడ్డిని చిరంజీవి అభినందించారు.

కుక్కలదాడిలో బాలుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో కుక్కల దాడిలో మరో బాలుడు మృతిచెందాడు. ఈ నెల 8న శునకాల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదు నెలల బాలుడు సోమవారం చనిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజి- అనుష దంపతులు షేక్‌పేట వినోబానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 8న వారి ఐదు నెలల బాలుడిని గుడిసెలో ఉంచి కూలి పనికి వెళ్లారు. గుడిసె వద్దకు వచ్చిన వీధి కుక్కలు ఆ చిన్నారిని గాయపరిచాయి. తల్లిదండ్రులు వచ్చేసరికి బాలుడు రక్తపు మడుగులో ఏడుస్తూ కనిపించాడు. వెంటనే వారు బాలుడిని ఓ ప్రయివేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి నీలోఫర్ ఆస్పత్రికి, ఆపై ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. తాము గతంలో వీధి కుక్కలపై ఎన్నోసార్లు పోలీసులకు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామని, కానీ ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

భార్యతో బలవంతపు సెక్స్ వ్యాపారవేత్తకు 9ఏళ్లు జైలు శిక్ష

రాయ్‌పూర్: భార్యను లైంగికంగా బలవంతం చేసినందుకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్తకు తొమ్మిదేళ్ల జైలు శిక్ష పడింది. వ్యాపారి భార్య ఇచ్చిన ఫిర్యాదుపై విచారించిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు సదరు వ్యాపారిని దోషిగా నిర్ధారించింది. ఫిర్యాదిదారుతో వ్యాపారి వివాహం 2007లో జరిగింది. అప్పటి నుంచి అతను తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడని, చాలా సార్లు అసహజంగా సంభోగానికి బలవంతం చేశాడని, వరకట్నం కోసం వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. బిడ్డ పుట్టిన తరువాత కూడా హింస కొనసాగిందని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐపిసి 377, సెక్షన్ 428 కింద సదరు భర్తపై కేసు నమోదు చేశారు.

కర్నూలు జిల్లా సమ్మెలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పళ్లెలు మోగిస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మోకాళ్లపై కూర్చుని, పళ్లాలు మోగిస్తూ నిరసన

ఆరో రోజు కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి- యంత్రాంగం

సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగు ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా మోకాళ్లపై కూర్చుని, పళ్లాలు మోగిస్తూ నిరసన తెలిపారు. రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు మరిచి తమను మోసం చేశారని, ఇచ్చిన హామీని అమలు చేయకపోతే తగిన గుణపాఠం చెబుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వారి సమ్మె సోమవారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్ఎస్ఎ ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ నెల 26 నుండి 31 వరకు వివిధ రూపాల్లో నిరసనలు, మాస్‌ర్యాలీలు కొనసాగుతాయని అన్నారు. రాష్ట్ర జెఎసి నాయకులు, మాజీ ఎంఎల్‌సిలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరవుతారని అన్ని రకాల ఆందోళనకు ఎస్ఎస్ఎ ఉద్యోగులందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఖాళీ విస్తరాకులతో ఉద్యోగులు నిరసన తెలియజేశారు. సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ సందర్శించి మాట్లాడారు. సర్వశిక్ష ఉద్యోగులు తాము ఒంటరిని అనుకోవద్దని, పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం స్పందించే వరకూ పోరాటాన్ని ఉధృతం చేయాలని కోరారు.

కౌలురైతు సంఘం, యుటిఎఫ్, ఎస్‌టియు సంఘాలు సంఘీభావం తెలిపాయి. విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సమగ్ర సర్వశిక్ష ఉద్యోగులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి కాంతారావు మాట్లాడుతూ సర్వ శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమండ్ చేశారు. కర్నూలు జిల్లాలో నిరసనలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ మాట్లాడారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమ్మె శిబిరంలో పళ్లాలు మోగిస్తూ సర్వశిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. వారి పోరాటానికి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ మద్దతు తెలిపారు. కృష్ణాజిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో సర్వశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. సమ్మెకు పలువురు సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో నిరవధిక సమ్మె కొనసాగింది.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె మరింత ఉధృతం

- రేపు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు వినతులు
- అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్లు ప్రకటించాయి. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఇ పద్మ విజయవాడలోని బాలోత్సవ భవనంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీల సమ్మె 14 రోజులకు చేరిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు తదితర విషయాల్లో ప్రభుత్వం నోరు మెదపలేదని పేర్కొన్నారు. గతంలో జరిగిన చర్చల్లో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని అంగీకరించారని, ఇప్పటి వరకు దీనికి సంబంధించిన జిఓ ఇవ్వలేదన్నారు. సమస్యలను పరిష్కరించకుండా సచివాలయ ఉద్యోగులతో కేంద్రాల తాళాలు పగలగొట్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ టార్చర్ భరించలేక తూర్పుగోదావరి జిల్లాలో వర్కర్ ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. మృతిచెందిన కుటుంబాలకు మట్టి ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ గ్రేడ్-2 సూపర్‌వైజర్ 560 పోస్టులు ఇచ్చామని మంత్రి ఉషశ్రీ చరణ్ అబద్ధాలు ఆడుతున్నారని అన్నారు. తమ సమ్మెకు లబ్ధిదారుల నుంచి అపూర్వ మద్దతు లభిస్తుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను తెరవాలని ప్రభుత్వం నాలుగు శాఖలతో తలకిందులుగా తపస్సు చేసిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క పిల్లాడికి కూడా సరైన తిండి పెట్టలేకపోతుందన్నారు. ప్రభుత్వం అద్దెలు ఇవ్వకపోయినా గర్భిణులు, బాలింతలకు పోషణ అందించామన్నారు. లబ్ధిదారులకు ఇచ్చే ఆహారం నాసిరకంగా ఉందని, నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని కోరారు. అన్ని డిమాండ్లనూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కుటుంబ సభ్యులతో ఖాళీ కంచాలు, గరిటలు మోగిస్తామని తెలిపారు. 27న ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రుల ఇళ్లు, క్యాంపు కార్యాలయాలకు సామూహిక వినతిపత్రాలు అందిస్తామని, 28న ముఖ్యమంత్రికి పోస్టు కార్డు ఉద్యమం చేపడతామన్నారు.

29న రిలే దీక్షలు చేపడతామని తెలిపారు. ప్రజా సంఘాలు, లబ్ధిదారుల సహకారంతో 30న గ్రామ, వార్డు, సచివాలయాల వద్ద ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. 31న ఆట పాట నిర్వహిస్తామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 1 నుంచి పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. తమ ఆందోళనలకు రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు, లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజలు విశాల మద్దతు ఇవ్వాలని కోరారు.

వినతి పత్రాలు చూపుతున్న అంగన్‌వాడీ నాయకులు

రేపటి నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ

- మూడు రోజులపాటు నిర్వహణ
- చివరి రోజు భారీ ప్రదర్శన, బహిరంగ సభ
- హాజరు కానున్న అఖిల భారత నాయకులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ బుధవారం నుంచి కాకినాడలో ప్రారంభం కానున్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లోని అల్లూరి సీతారామరాజు నగర్, ధీరజ్ ప్రాంగణంలో ఈ నెల 29 వరకు మహాసభ జరగనుంది. రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది ప్రతినిధులు పాల్గొనున్నారు. చివరి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆనంద భారతి గ్రౌండ్ నుంచి హైస్కూల్ గ్రౌండ్ వరకు విద్యార్థి కవాతు, భారీ ప్రదర్శన జరగనుంది. జిల్లా వ్యాప్తంగా ముఖ్య ప్రాంతాలను ఎస్ఎఫ్ఐ తోరణాలు, జెండాలతో అలంకరించారు. ముఖ్యంగా కాకినాడ నగమంతా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలతో నిండిపోయింది.

అన్ని కూడళ్లలో తోరణాలు కట్టారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి.సాను, మయుక్ విశ్వాస్, అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆదర్శ్ ఎం.సాజీ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ హాజరు కానున్నారు. గత కార్యక్రమాలను సమీక్షించడంతోపాటు ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పనకు ఈ మహాసభ నిర్వహిస్తున్నామని నిర్వాహక కమిటీ తెలిపింది. తొలిరోజు ప్రారంభ సభకు కాకినాడ జెఎన్‌టియుకె వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాద్‌రాజు, పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం, రెండో రోజు పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, మూడో రోజు బహిరంగ సభలో జాతీయ నాయకులతోపాటు మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ మహాసభ జరిగే మూడు రోజులూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాకినాడ అంబేద్కర్ సెంటర్ వద్ద తోరణాలు కడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అదానీ కోసం... శారదా నదిపై పిఎస్‌పి

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక గిరిజనులు, ఆయకట్టుదారుల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

అందరిలో ఆందోళన

తాజాగా జరుగుతున్న సర్వేలో నీటి వనరులు, నిర్మాణానికి ఉన్న నాణ్యత, అవకాశాలు, నీటి నిల్వ ప్రదేశాలు, నీటి ప్రవాహ ప్రాంతాలపై వివరాలు సేకరిస్తున్నట్లు చెబుతన్నారు. ఇవన్నీ అనుకూలంగా ఉంటే ప్రభుత్వానికి పిఎస్‌పి ఏర్పాటుకు దరఖాస్తు చేయనున్నారు. అయితే, ఈ ప్రక్రియ అంతా లాంఛనమేనని, ప్రభుత్వం నుండి ఖచ్చితమైన ఆమోదంతోనే ఇక్కడ సర్వే తంతు జరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ ప్రాంతం షెడ్యూల్ ఏరియాలో లేకపోవడం, అదానీ సంస్థ వ్యూహాత్మకంగా ఇక్కడే ఎంపిక చేసుకోవడం వెనుక ఉన్నత స్థాయి ప్రమేయం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నదిపై పిఎస్‌పి ఏర్పాటైతే రైవాడ ఆయకట్టు 15,344 ఎకరాలు దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. యంత్రంతో మట్టి నమూనాలు తీయడంతో దీని కింద భూములు కలిగిన గిరిజనులు తమ భూములు పోతాయని ఆందోళన చెందుతున్నారు. పవర్ కంపెనీ పెడతారని అంటున్నారని, ఇది కడితే తమ భూములుపోతాయని బలిపురం గిరిజన రైతు గమ్మిలి సత్యం ఆందోళన వ్యక్తం చేశారు. పవర్ ప్రాజెక్టు పనులకు మట్టి నమూనాలు తీస్తున్న విషయం తెలిశాక అడ్డుకున్నామని, ఇది వస్తే తమ భూములన్నీ పోతాయని తామరబ్బ సర్పంచ్ రామకృష్ణ 'ప్రజాశక్తి'కి చెప్పారు. పంచాయతీ అనుమతుల కోసం ఎటువంటి దరఖాస్తూ చేయలేదని తెలిపారు. పిఎస్‌పి ఏర్పాటుపై సంబంధిత అధికారులను వివరణ కోరగా, ఇంకా తమ దృష్టికి రాలేదని, ప్రాజెక్టు ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై సర్వే జరుగుతుందేమోనని చెబుతున్నారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

పులివెందులలో క్రిస్మస్ వేడుకల్లో సిఎం జగన్

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా చివరి రోజు సోమవారం ఆయన వైఎస్ఆర్ జిల్లా పులివెందులలోని సిఎస్ఐ చర్చిలో తన తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థన కూటమిలో పాల్గొన్నారు. అనంతరం సిఎస్ఐ చర్చిలో విజయమ్మతో కలిసి క్రిస్మస్ కేకు కట్ చేసి ఆమెకు కేక్ తినిపించారు. సిఎస్ఐ చర్చి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రార్థనా కూటముల అనంతరం చర్చిలో జగన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు, తన కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న బంధువులు, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏటా తన సొంత గడ్డపై ఇదే చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, కడప ఎంపి అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మైదుకూరులో జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ మదీనా కుమారుడి వివాహానికి ముఖ్యమంత్రి హాజరై నూతన వధువరులను, పులివెందులలో కూడా నవదంపతులను ఆశీర్వదించారు. సిఎస్ఐ చర్చిలో ప్రార్థనా కూటముల అనంతరం భాకారపురం నుంచి మైదుకూరుకు, అక్కడి నుంచి కడపకు చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరారు.

ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం దుర్మార్గం

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయాలని చూడడం దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే దీక్షలు సోమవారానికి 1047వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఎండి, యుటిలిటీస్, అడ్మిన్, టిటిఐ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటుపరం చేసి కార్మిక వర్గాన్ని నడిరోడ్డుపాలు చేసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఆ ప్రయత్నాలను ఐక్య పోరాటాలతో అడ్డుకుంటామని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలతో మాత్రమే కార్మిక హక్కులు, కార్మిక సంక్షేమం, పర్యావరణ రక్షణ, సిఎస్ఆర్ కింద పరిసరాల అభివృద్ధి తదితర సామాజికహితమైన అంశాలు అమలవుతాయని వివరించారు. ప్రయివేటులో అవన్నీ కాగితాల మీదనే ఉంటాయన్నారు. ఇప్పటికైనా ప్రయివేటీకరణ ప్రయత్నాలు వీడి స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు జి ఈశ్వరరావు, విఎస్ వరప్రసాద్, బి బాలస్వామి, ఎన్ నాగార్జున పాల్గొన్నారు.

'అనంత' రైతు కన్నీటి మంట

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేస్తున్నాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఈ ఏడాది 26.828 టిఎంసిల నీరొస్తుందని అంచనాతో అధికారులు జూన్‌లో ప్రణాళికలు రూపొందించి లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలని నిర్ణయించారు. ఈ ఏడాది 16.41 టిఎంసిలు మాత్రమే ఇచ్చారు.

బోర్లు వేసినా నీరు పడక పంట వదిలేశా

నాకున్న ఎనిమిది ఎకరాల్లో నాలుగు ఎకరాల్లో పత్తి, నాలుగు ఎకరాలో మిర్చి పంట సాగు చేశాను. వర్షాభావమున్నప్పటికీ పత్తి కొంతవరకు దిగుబడి వచ్చింది. మిర్చి పంట పూర్తిగా దెబ్బతింది. కీలకమైన సమయంలో ఆయకట్టుకు నీరు రాలేదు. పంటను కాపాడుకునేందుకు రెండు బోర్లు వేసినా నీరు పడలేదు. ట్యాంకర్ల ద్వారా నీటి తడులు ఇచ్చి పంటను కాపాడుకుందామనుకుంటే డబ్బుల్లేక వదిలేశాను. ఇప్పటికే ఏడు లక్షల రూపాయలు పెట్టుబడి అయింది. పంట ఏ మాత్రమూ చేతికొచ్చే అవకాశం లేదు.

- రంగారెడ్డి,
రైతు, పెద్దవడుగూరు

రైతులను ఆదుకోవాలి

ఆయకట్టుకు నీరొస్తుందన్న నమ్మకంతో రైతులు మిర్చిని సాగు చేశారు. కీలక దశలో సాగు నీరు ఆగిపోయింది. ఇప్పటికే లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. పంట కళ్ల ముందే ఎండిపోతుండడంతో కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు, కష్టాలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నీటిని అందించడంతోపాటు, నష్టపోయిన రైతును ఆదుకుంటామని ప్రభుత్వం భరోసా కల్పించాలి.

- దస్తగిరి,
ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

బైజూస్ ట్యాబ్‌ల స్కామ్

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిస్థాయి డిజిటల్ విద్య నేర్పించవచ్చునని సూచించారు. ట్యాబులు కాకుండా పాఠశాలల్లో డిజిటల్ ల్యాబులు పెడితే పిల్లలకు ఉపయోగం ఉంటుందని తెలిపారు. అశాస్త్రీయమైన విధానాలతో విద్యా విధానాన్ని ప్రైవేట్‌కు అప్పజెప్పేందుకు బైజూస్‌ను ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. బైజూస్ ఒప్పందాన్ని రద్దు చేసి ఎస్‌సిఇఆర్‌టి వంటి పరిశోధన విభాగాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. బైజూస్ కంటే బెటర్‌గా ప్రభుత్వ ఉపాధ్యాయులు కంటెంట్ తయారు చేస్తారని వివరించారు. 100 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు రూ.లక్ష చొప్పున వేతనం ఇస్తూ ఈ కంటెంట్, సాఫ్ట్‌వేర్, మానిటరింగ్ ప్రభుత్వం నిర్వహించవచ్చునని సూచించారు. మొత్తం రూ.25 కోట్లతో ఉపాధ్యాయులతో వీడియోలు, బోధన చేయించవచ్చునని చెప్పారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఆనందపడటంతో పాటు కంటెంట్‌పై ప్రభుత్వానికి హక్కు ఉంటుందని సూచించారు.

అంగన్‌వాడీలను వీధుల్లోకి నెడతారా...

అంగన్‌వాడీల వేతనాలు పెంచేందుకు డబ్బుల్లేవంటున్న ప్రభుత్వం కుంభకోణాలకు మాత్రం నిధులు మళ్లిస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీలను వీధుల్లోకి నెట్టి కన్నీటిపర్యంతం చేయడం ముఖ్యమంత్రికి తగునా అని నిలదీశారు. ఇప్పటికైనా సిఎం మౌనం వీడి ఇచ్చిన హామీ ప్రకారం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 1.05 లక్షల మంది అంగన్‌వాడీలు 14 రోజులుగా నిరవధిక సమ్మె శాంతియుతంగా చేస్తున్నారని తెలిపారు. వారు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, సొంతంగా పెట్టుకున్న డిమాండ్ కూడా కాదన్నారు. ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో తెలంగాణ కంటే రూ.1000 అధికంగా వేతనం చెల్లిస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారని తెలిపారు. మాట తిప్పం, మడమ తిప్పమని చెప్పే ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారో లేదోనని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్తూ ప్రభుత్వ కార్యక్రమాలను అంగన్‌వాడీలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వీరి పట్ల ప్రభుత్వం మానవత దృక్పథం లేకుండా మొండిగా వ్యవహరిస్తోందని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కనీసం చర్చలకు కూడా పిలవకుండా సాచివేత ధోరణి చూపుతూ అంగన్‌వాడీలపై పెద్దఎత్తున తప్పుడు ప్రచారం నిర్వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను మంత్రులు, ఎమ్మెల్యేలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. డిమాండ్లపై భినాభిప్రాయాలు ఉంటే చెప్పాలని, కానీ తోటి మహిళలు అనే గౌరవం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడితే కార్మికవర్గం ఎలాంటి వైఖరి తీసుకుంటుందో ప్రభుత్వం ఆలోచన చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా తక్షణమే చర్చలకు పిలిచి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పది వామపక్ష పార్టీలు కూడా అంగన్‌వాడీ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశాయని గుర్తుచేశారు.

టోల్‌గేట్ల ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

- మార్చి 2024 నుంచి జిపిఎస్‌తో టోల్ వసూళ్లు
- రాష్ట్రంలో 9 వేల మందికి ఉద్వాసన తప్పదా?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టోల్‌గేట్ల వ్యవస్థను పూర్తిగా తొలగిస్తూ రోడ్లపై వాహనాలు తిరిగే ప్రతి కిలోమీటర్‌కు లెక్కగట్టి టోల్ ఫీజును వసూలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జిపిఎస్ వ్యవస్థ రాష్ట్రంలోని దాదాపు 9 వేల మంది ఉద్యోగుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసింది. 2024 మార్చి నుండి టోల్‌గేట్ల వ్యవస్థను రద్దు చేస్తూ జిపిఎస్ ద్వారా టోల్‌ఫీజ్ వసూలు చేస్తామని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల చేసిన ప్రకటన టోల్‌గేట్లలో పనిచేస్తున్న ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రంలోని నిత్యం రద్దీగా వుండే 16వ నెంబర్ జాతీయ రహదారి, 44వ జాతీయ రహదారిపై వున్న టోల్‌గేట్లలో సగటున వంద మందికి పైగా పనిచేస్తుంటే మిగిలిన రోడ్లలో సగటున 70 నుండి 90 మంది వరకు పనిచేస్తున్నారు. ఇప్పుడు ప్రతి వాహనం ఫాస్టాగ్‌ను పెట్టుకొని టోల్‌గేట్ల వద్ద ఆటోమెటిక్‌గా టోల్‌ఫీజులను ఎలా చెల్లిస్తారో ఇకపై రోడ్డుమీదికి వచ్చిన ప్రతి వాహనం ఎన్ని కిలోమీటర్లు ప్రయాణం చేసిందో ఆ మేర ఫీజును ఆ వాహనం రోడ్డు దిగగానే ఆ మొత్తం కట్ అయ్యేలా జిపిఎస్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. మొన్నటి వరకు టోల్‌గేట్ల వద్ద వాహన డ్రైవర్ నుంచి నగదును తీసుకుని టోల్‌గేట్ రసీదు ఇచ్చేవారు. ఈ ప్రక్రియలో సగటున 8 నిమిషాల వ్యవధి పడుతుందని, దానిని తగ్గించేందుకు ఫాస్టాగ్‌ను ప్రవేశ పెట్టారు. ఈ విధానం 2021 నుండి అన్ని టోల్‌గేట్లలో అమలు చేస్తున్నారు. ఫాస్టాగ్ ద్వారా టోల్‌గేట్ల వద్ద 8 నిమిషాల నుండి నిమిషంలోపు సమయం కుదించబడ్డా ఆ మేర రవాణాకు అంతరాయం కలగకూడదని ప్రవేశపెడుతున్న జిపిఎస్‌తో టోల్‌గేట్లలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతకు ముప్పు ఏర్పడింది. ఇప్పటి వరకు టోల్‌గేట్ సమీప గ్రామాల ప్రజలకు చెందిన వాహనాలకు ఆ టోల్‌గేట్‌లో మినహాయింపులు వుండేవి. ఇకపై అలాంటి వెసులుబాటుకు కూడా జిపిఎస్ పద్ధతి మంగళం పాడనుంది. ప్రతి వాహనం ఇకపై ఫాస్టాగ్ స్థానంలో జిపిఎస్ ట్రాకర్‌ను తప్పనిసరి చేస్తారు. జిపిఎస్ ట్రాకర్ వున్న వాహనం రోడ్డు ఎక్కగానే కౌంట్ మొదలవుతుంది. ఆ రోడ్డు దిగగానే ఎన్ని కిలోమీటర్లు ప్రయాణం చేసిందో లెక్కకట్టి కిలోమీటర్‌కు ఫిక్స్ చేసిన ఫీజు ప్రకారం టోల్‌ఫీజు మన ఖాతా నుండి కట్ అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 8,615 కిలోమీటర్ల జాతీయ రహదారులకు టోల్ ఫీజులు వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారులతోపాటు వినుకొండ, తిరుపతి సమీపంలోని రెండు రాష్ట్ర రహదారులకు కూడా టోల్‌ఫీజు వసూలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 టోల్‌ప్లాజాలు వుంటే అందులో చెన్నైయ్-కోల్‌కతా రోడ్డుపైనే 19 టోల్‌గేట్లు వున్నాయి. ఈ ఏడాదిలోపు ఈ టోల్‌గేట్లన్నిటికీ మంగళం పాడి జిపిఎస్ పద్ధతిలో 2024 మార్చి నుంచి టోల్‌ఫీజు వసూలుకు కసరత్తు చేస్తున్నారు. జాతీయ రహదారులపై టోల్‌గేట్లలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రత్యామ్నాయం చూపాలని ఉద్యోగులు కోరుతున్నారు.

మూడు విమానాలు అత్యవసర ల్యాండింగ్

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం విమానాశ్రయంలో సోమవారం మూడు విమానాలు అత్యవసర ల్యాండింగ్ జరిగింది. హైద్రాబాద్‌లో వాతావరణం అనుకూలించకపోవడంతో గన్నవరం విమానాశ్రయంలో అత్యవసర లాండింగ్‌కు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. చండీగఢ్ నుండి హైదరాబాద్, గోవా నుండి హైద్రాబాద్, తిరువనంతపురం నుండి హైద్రాబాద్ వెళ్లవలసిన మూడు ఇండిగో విమానాలు గన్నవరానికి చేరుకున్నాయి. ఒక్కో విమానంలో సుమారు 165 మంది ప్రయాణికులు ఉన్నారు. ఉదయం పది గంటల తర్వాత తిరిగి మూడు విమానాలు హైదరాబాదు వెళ్లాయి.

శ్రీకాకుళంలో మూడు కోవిడ్ కేసులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లాలో సోమవారం మూడు కోవిడ్ కేసులు వెలుగు చూశాయి. మెళియాపుట్టి మండలం దుర్భలాపురానికి చెందిన 73 ఏళ్ల వృద్ధుడు కోవిడ్ లక్షణాలతో ఈ నెల 16న శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చేరారు. విటిఎం పరీక్షలు నిర్వహించగా ఈ నెల 24న కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం సర్వజన ఆస్పత్రి కోవిడ్ ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కోవిడ్ వేరియంట్ నిర్ధారణ కోసం విజయవాడలోని ల్యాబ్‌కు పంపారు. సోమవారం మరో ఇద్దరు కోవిడ్ బారిన పడ్డారు. కొత్తూరు మండలం కుద్దిగాంకు చెందిన 60 ఏళ్ల వృద్ధునికి, శ్రీకాకుళం నగరం కంపోస్టు కాలనీకి చెందిన 50 ఏళ్ల ఓ మహిళకు కోవిడ్ సోకింది. వీరిద్దరికీ రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రిలో ఉత్పత్తికి అంతరాయం

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా పరవాడలోని ఎన్‌టిపిసి సింహాద్రిలో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలిగింది. 500 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన యూనిట్‌లో పైపులైన్ లీకేజీతో అంతరాయం ఏర్పడింది. దీని మరమ్మతులు పూర్తి కావడానికి రెండు రోజులు పడుతుందని, బుధ లేదా గురువారాల్లో పునరుత్పత్తి జరుగుతుందని మేనేజ్‌మెంట్ చెబుతోంది. ఇదిలా ఉండగా 500 మెగావాట్లు విద్యుత్ సామర్థ్యం కలిగిన మరో యూనిట్‌ను వారం రోజుల నుంచి మెయింటినెన్స్ నిమిత్తం ఆపేశారు. ఈ యూనిట్ పునరుద్ధరణకు ఒకటి, రెండు నెలలు పట్టే అవకాశముంది. ఎన్‌టిపిసి సింహాద్రి రెండు వేల మెగావాట్ల విద్యుత్తును ఇప్పటి వరకూ ఉత్పత్తి చేస్తూ రాగా ప్రస్తుతం వెయ్యి మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తోందని యాజమాన్యం తెలిపింది.

చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు చూడకు అంటూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శిలువకు వేలాడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్త

పండుగ మీకు.. పస్తులు మాకా?

- సమ్మె శిబిరాల వద్ద క్రిస్మస్ కేక్ కట్ చేసిన అంగన్‌వాడీలు
- రాష్ట్రవ్యాప్తంగా 14వ రోజూ కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ముఖ్యమంత్రికి జ్ఞానోదయం కలిగించాలని క్రిస్మస్‌ను పురస్కరించుకుని సమ్మె శిబిరాల వద్ద అంగన్‌వాడీలు క్రిస్మస్ కేక్‌కు కట్ చేసి నిరసనలు తెలిపారు. 'పండుగ మీకు.. పస్తులు మాకా' అంటూ ప్లకార్డులు చేతబూనారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారానికి 14 రోజులకు చేరుకుంది. మొక్కవోని దీక్షతో క్రిస్మస్ రోజూ కూడా తమ నిరసనను కొనసాగించారు.

విజయవాడ ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులతో కలిసి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమ్మెకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, అధ్యక్షులు జి. బేబిరాణి మద్దతునిచ్చి మాట్లాడారు. అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ నెల 29న రాష్ట్రంలోని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఆందోళనకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. అంగన్‌వాడీలకిచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.26 వేలు, సుప్రీంకోర్టు తీర్పుననుసరించి గ్రాట్యూటీ మంజూరు, పని భారం తగ్గింపు తదితర న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కృష్ణాజిల్లా కలెక్టరేట్ వద్ద సమ్మె కొనసాగింది.

'పండగ పూట మాకు ఇదేం ఖర్మ' అని అంగన్‌వాడీలు బాపట్లలో తలపట్టుకొని రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలియజేశారు. 'పండుగ మీకు.. పస్తులు మాకా' అంటూ కాకినాడ జిల్లా పెద్దాపురంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద, జగ్గంపేటలో సమ్మె శిబిరం వద్ద ప్లకార్డులను పట్టుకుని నిరసన తెలిపారు. రామచంద్రపురంలో ఉద్యమ గీతాలు పాడుతూ నిరసన తెలిపారు. తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సమ్మె శిబిరాల వద్దే క్రిస్మస్ కేక్ కట్‌చేసి నిరసన తెలియజేశారు. యేసయ్యా మీరైనా సిఎం జగన్ మనసు మార్చాలని, అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని విజయనగరం కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో అభ్యర్థించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రార్థనలు చేశారు.

అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో చర్చిల వద్ద, సమ్మె శిబిరాల వద్ద కేక్ కట్ చేశారు. ఓబుళదేవరచెరువు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, చిలమత్తూరులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాణి పాల్గొన్నారు. నంద్యాల జిల్లా రుద్రవరంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట, కొలిమిగుండ్లలో చెవిలో పువ్వులు పెట్టుకుని, సంజామలలో శివాలయంలో పొర్లుదండాలు, చాగలమర్రిలో జలదీక్షలతో నిరసన తెలిపారు. కర్నూలులో వివిధ రూపాల్లో నిరసన తెలియజేశారు. నెల్లూరులో విఆర్‌సి క్రీడా మైదానం నుంచి వైఎంసిఎ గ్రౌండ్ సమీపంలోని జీసస్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. తిరుపతిలో 'హిందూ ముస్లిం క్రైస్తవులు భాయిభాయి' అంటూ సహఫంక్తి భోజనాలు చేశారు. పుత్తూరు టౌన్‌లో అంబేద్కర్ సర్కిల్ ఎదురుగా 'షూ' పాలిష్‌చేస్తూ నిరసన తెలిపారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు.

శ్రీకాకుళంలో శిలువ ఆకారంలో నిరసన తెలిపారు. పలాసలో అంగన్‌వాడీల పోరాటానికి విశ్రాంత ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి, సామాజిక కార్యకర్త జుత్తు తాతారావు రూ.ఐదు వేలు, వజ్రపుకొత్తూరు యుటిఎఫ్ నాయకులు బి.చిట్టిబాబు రూ.ఐదు వేలు ఆర్థికసాయం అందజేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఓ అంగన్‌వాడీ మహిళ శిలువకు వేలాడుతూ నిరసన తెలిపారు. తగరపువలసలోని అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ సందర్శించి, పోరాటానికి సంఘీభావం తెలిపారు. అల్లూరి జిల్లాలో పలుచోట్ల సమ్మె శిబిరాల్లోనే క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు నాసిరకమైనవని, పూజ చేసుకోవడానికి మినహా ఎందుకూ పనికిరావంటూ, యూనిఫామ్‌కు కూడా పూజ చేసి వినూత్న నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో సమ్మె కొనసాగించారు. ఏలూరులో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు.

బిజెపి నేతలను నిలదీసిన అంగన్‌వాడీలు

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలులో స్థానిక బిజెపి నాయకులు మద్దతివ్వడానికి రాగా అంగన్‌వాడీలు నిలదీశారు. 'కేంద్రంలో అధికారంలో ఉన్నారు కదా.. అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నెలకు రూ.26 వేలు ఇప్పించండి. అప్పుడే మా దగ్గరకు రండి' అని తెగేసిచెప్పారు. దీంతో చేసేది లేక వారు వెనుదిరిగారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కారును అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. దీంతో ఆమె కారు దిగి..అంగన్‌వాడీల వద్దకు వచ్చారు. తమ సమస్యలు పరిష్కరించేలా సిఎం దృష్టికి తీసుకెళ్లాలని ఆమెకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు.

ఇచ్ఛాపురంలో జెడ్‌పి చైర్‌పర్సన్ కారును అడ్డుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పోలీస్ అకాడమీ ఎక్కడ?

- కేంద్రం నుంచి రాని నిధులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

శాంతిభద్రతలకు అత్యంత కీలకమైన, కొత్త పోలీసులకు శిక్షణనిచ్చేందుకు అవసరమైన అకాడమీ ఉనికి రాష్ట్రంలో కనిపించడంలేదు. విభజన సమయంలో ఉమ్మడి రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ (అప్పా) తెలంగాణకు పరిమితమైంది. ఆ తరువాత రాష్ట్రంలో నూతన అకాడమీ ఏర్పాటు కాలేదు. దీంతో పోలీస్ అధికారుల శిక్షణ ప్రశ్నార్థకంగా మారింది. 1986లోనే హైదరాబాద్‌లో 175 ఎకరాల సామర్థ్యంతో అప్పాను ఏర్పాటుచేశారు. పోలీసు అధికారులకే కాకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, ఫోరెన్సిక్ నిపుణులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు అక్కడ శిక్షణ ఇచ్చేవారు. . విభజన అనంతరం పదో షెడ్యూల్‌లో ఉన్న అకాడమీని భౌగోళిక హక్కుల కింద తెలంగాణకు కేటాయించారు. అయితే, దానికి సంబంధించిన ఆస్తుల పంపకాలు మాత్రం ఇంకా జరగలేదు. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్‌లో నూతన అకాడమీ ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ ఫలితాలు కనిపించలేదు. . చివరకు గత ఫిబ్రవరిలో అకాడమీకి 185 పోస్టులను భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే నిర్మాణమే ఇంకా జరగని తరుణంలో ఈ పోస్టుల భర్తీకి కూడా ఉన్నతాధికారులు పెద్దగా ఆశక్తి చూపించడం లేదని తెలుస్తోంది. విభజన చట్టం మేరకు అకాడమీని ఏర్పాటుచేసేందుకు 2020 డిసెంబర్‌లోనే కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదనలు కూడా పంపించింది. భవనాల కోసం రూ.590 కోట్లు ఇవ్వాలని కోరింది. అయితే మూడేళ్లు ముగిసినా ఇప్పటివరకు ఆ నిధులపై కేంద్రం నుంచి ఎటువంటి స్పష్టమైన సంకేతాలు రాలేదని రాష్ట్ర అధికారులు చెబుతున్నారు.

బడ్జెట్‌లో 3.57 కోట్లే

ఇలా ఉండగా అకాడమీ నిర్వహణకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3.57 కోట్లను కేటాయించారు. ఇది కేవలం ఉన్న కొద్దిపాటి మంది జీతాలకి,, ఇతర నిర్వహణ వ్యయానికి మాత్రమేనని సమాచారం. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని అకాడమీ అధికారులు ఆర్థికశాఖకు పలు ప్రతిపాదనలు పంపించారు. ముందుగా ఎస్సై స్థాయి నుంచి ఐపిఎస్ అధికారుల స్థాయి వారకి శిక్షణ కోసం స్థలాన్ని కేటాయించాలని ప్రతిపాదించారు. వంద నుంచి 200 ఎకరాల భూమి కావాల్సి ఉంటుందని ఆ ప్రతిపాదనల్లో పేర్కొనడం విశేషం. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం, కేంద్రం నుంచి నిధులు రావడం జరిగితేనే పోలీస్ అకాడమీ సాధ్యమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రేపల్లె ఇన్‌ఛార్జిగా మోపిదేవిని నియమించాలి

- మత్స్యకార సంఘాల నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

వైసిపి రేపల్లె ఇన్‌ఛార్జిగా మోపిదేవి వెంకటరమణను నియమించాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి బైపాస్‌రోడ్డులోని ఓ హోటల్‌లో సోమవారం వివిధ జిల్లాల మత్స్యకార సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేష్ఠ కార్పొరేషన్ డైరెక్టర్ (హిందూపురం) బి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు రూ.40 లక్షల ఓటింగ్ కలిగి ఉన్నారని, ఓటింగ్ ప్రాతిపదికన రాష్ట్రవ్యాప్తంగా 20 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రేపల్లె ఇన్‌ఛార్జిగా మోపిదేవి ప్రాముఖ్యత ఇవ్వాలని, సిట్టింగ్ ఎమ్మెల్యేలను తొలగించవద్దని తీర్మానించారు. కొత్త వారికి నామినేటెడ్ పదవులిచ్చి వారికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికంగా, విద్యపరంగా, రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించాలన్నారు. మోపిదేవిని ఇన్‌ఛార్జిగా నియమించకపోవడం మత్స్యకారుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే జెఎసిగా ఏర్పడతామన్నారు.

మాట్లాడుతున్న మత్స్యకార సంఘాల నాయకులు

ఆకట్టుకున్న నంది నాటకోత్సవాలు

- మూడో రోజు భారీగా ప్రేక్షకులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర చలనచిత్ర టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు సోమవారం మూడోరోజు ఉల్లాసంగా జరిగాయి. గుంటూరులో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతున్న ఈ నంది నాటకోత్సవాలు ఉదయం నుంచి రాత్రి వరకూ పలు కార్యక్రమాలు ప్రదర్శితమయ్యాయి. నాటకాలను వీక్షించేందుకు ప్రేక్షకులు భారీగా హాజరయ్యారు.

మూడోవరోజు ప్రదర్శనలలో విజయవాడ శ్రీ రామ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వారి మంచి (గుణ) పాఠం బాలల నాటికను ప్రదర్శించారు. ఈ నాటికను డాక్టర్ పివిఎన్ కృష్ణ రచించగా పి సాయిశంకర్ దర్శకత్వం వహించారు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా బాల కార్మిక వ్యవస్థను రూపు మాపలేక పోవడం విచారకరమని, దానికి ఏంచేస్తే బాలలందరికీ ఉజ్వల భవిత దక్కుతుందో అనే విషయంపై పాఠశాల విద్యార్థులు చక్కగా నటించారు. వీరికి రూ.25 వేల పారితోషికం, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని రాష్ట్ర చలన చిత్ర, టివి, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి అందజేశారు.

తెనాలి వారు ఝునక్ ఝునక్ పాయల్ భాజే " సాంఘిక నాటకం ప్రదర్శించారు. బండల పక్కన ఏరు .ఏరు పక్కనే ఊరు. ఊరుకొక్క పోరు అంటూ పోరాటాలు, ఆరాటాలు వీటన్నిటి నేపథ్యంలో ప్రపంచానికి పోరాటం నేర్పిన కళాకారుడి పరిస్థితి తనదాకా వస్తే ఎలావుంటుందన్న విషయాన్ని ఈ నాటికలో చూపించింది. ఎంఎస్ చౌదరి రచన దర్శకత్వాలలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కళా బృందానికి రూ.40 వేలు, మెమెంటో, ప్రశంసపత్రాలను అందజేశారు. విశాఖపట్నం తెలుగు కళా సమితి వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' సాంఘిక నాటికను ప్రదర్శించారు. ఇది 'దిశ' యధార్థ కథ ఆధారంగా రూపొందిన నాటిక. సవేరా ఆర్ట్స్ సంగీత సాహిత్య నాటక సంస్థ కడప వారు సమర్పించిన 'శ్రీరామ పాదుకలు' పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. రామాయణం పాదుకా పట్టాభిషేక ఘట్టం ఈ నాటక ప్రధాన ఇతివృత్తం.

విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి "నిశ్శబ్దమా నీ ఖరీదెంత?" సాంఘిక నాటికలోని సన్నివేశం

కొత్త వ్యాపారాల్లోకి వివాంటా ఇండస్ట్రీస్

- టెక్, ఇవి చార్జింగ్ విభాగాల్లోకి ప్రవేశం

VIVANTA
INDUSTRIES LIMITED

అహ్మాదాబాద్ : వివాంటా ఇండస్ట్రీస్ ఆధునిక వ్యాపారాలపై దృష్టి పెడుతున్నట్లు ప్రకటించింది. డ్రోన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎఐ, రోబోటిక్స్, విద్యుత్ వాహన ఛార్జింగ్ స్టేషన్ల తదితర కొత్త వ్యాపారాల్లోకి అడుగుపెడుతున్నట్లు వెల్లడించింది. ఈ లిస్టెడ్ కంపెనీ ప్రస్తుతం కాన్సెప్ట్ నుంచి అమలు వరకు ప్రాజెక్టులకు కన్సల్టెన్సీ, టర్న్ కీ సొల్యూషన్స్ అందిస్తోంది. తమ కంపెనీ ఇప్పటికే డ్రోన్, ఇవి వ్యాపారంపై పనిని ప్రారంభించినట్లు పేర్కొంది. రాబోయే కాలంలో దీనిని పెద్దది చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. 2023 సెప్టెంబర్‌లో వివాంటా డ్రోన్ రీసెర్చ్ సెంటర్ టాంజానియా లిమిటెడ్‌తో ప్రాథమిక ఎంఒయు కుదుర్చుకున్నట్లు పేర్కొంది. అసెంబ్లీ లైన్ ఏర్పాటుతో పాటు డ్రోన్ల ఆర్అండ్‌డి కోసం విడిఆర్ సిటిఎల్‌లో 50 శాతం వాటాను వివాంటా ఇండస్ట్రీస్ లిమిటెడ్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. ఆఫ్రికా ఖండం నుంచి గణనీయమైన వ్యాపార అవకాశాన్ని కంపెనీ ఆశిస్తోంది. ప్రాజెక్టును వేగవంతం చేయాలని చూస్తోన్నట్లు తెలిపింది.

సోచ్‌లో 50 శాతం డిస్కౌంట్లు

హైదరాబాద్ : సోచ్ తన రెడ్ డాట్ సేల్‌ను తిరిగి తెచ్చినట్లు ఆ సంస్థ తెలిపింది. వివిధ రకాల ఎత్నిక్ వేర్‌లపై 50 శాతం వరకు డిస్కౌంట్లను అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ రెడ్ డాట్ సేల్‌లో చీరలు, సల్వార్ సూట్లు, కుర్తాలు, కుర్తా సెట్‌లు, డ్రెస్ మెటీరియల్‌లు, ట్యూనిక్స్, కఫ్తాన్‌లతో సహా అనేక వస్త్రాలున్నాయని తెలిపింది.

మాన్యావర్ కొత్త కలెక్షన్‌తో రామ్ చరణ్

న్యూఢిల్లీ : వేదాంత్ ఫ్యాషన్ లిమిటెడ్‌కు చెందిన మాన్యావర్ బ్రాండ్ తన వెడ్డింగ్ కలెక్షన్‌లో ఆ సంస్థ బ్రాండ్ అంబాసిడర్ నటుడు రామ్ చరణ్ కొత్త కలెక్షన్‌ను ఆవిష్కరించారు. తాజాగా వివాహ కలెక్షన్‌లో భాగంగా పంచకచం, వేష్టికి సంబంధించిన వస్త్రాలను దక్షిణాదిలోకి విడుదల చేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఇవి దక్షిణాది వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపింది. ఇందులో రామ్ చరణ్‌కు జోడీగా శోభిత దూళిపాళ్ల నటించారు.

వ్యవసాయ ఎగుమతుల్లో.. ఐదు ఉత్పత్తులదే సగంపైగా వాటా

న్యూఢిల్లీ: భారత వ్యవసాయ రంగ మొత్తం ఎగుమతుల్లో కేవలం ఐదు ఉత్పత్తులే 51.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) రిపోర్ట్ ప్రకారం.. బాస్మతి బియ్యం, బాస్మతీయేతర బియ్యం, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, వంట నూనెలు మెజారిటీ వాటాను కలిగి ఉన్నాయి. ఈ ఉత్పత్తులపైనే వ్యవసాయ రంగం ఎగుమతులు ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. ఇవి ప్రపంచ స్థాయిలో ధరలు, డిమాండ్‌ను ప్రభావితం చేస్తాయి. కాగా.. ఈ రంగం మౌలిక సదుపాయాల లోపాలు, నాణ్యత నియంత్రణ సమస్యలు, టారిఫ్ అడ్డంకులు తదితర సవాళ్లను ఎదుర్కొంటుంది. ఇవి భారత వ్యవసాయ రంగ ఎగుమతుల్లో వృద్ధి, పోటీతత్వానికి ప్రధాన అడ్డంకిగా ఉన్నాయి.

వాల్ డిస్నీలో రిలయన్స్‌కు మెజారిటీ వాటా

న్యూఢిల్లీ : వాల్ డిస్నీ ఇండియాలో మెజారిటా వాటా కొనుగోలుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒప్పందం చేసుకుంది. గత వారం లండన్‌లో వాల్ట్ డిస్నీ- రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య నాన్ బైండింగ్ ఒప్పందం జరిగింది. మెగా విలీనం తర్వాత రిలయన్స్ యాజమాన్యంలోని వయాకామ్18కు స్టార్ ఇండియా సబ్సిడరీ అవుతుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ఈ విలీనం పూర్తి కానుందని ఆ వర్గాలు తెలిపాయి. దీంతో వయాకామ్18కు 51 వాటా స్టార్ ఇండియాకు 49 శాతం వాటా చేరిపోతుంది. మెగా విలీనం తర్వాత రిలయన్స్ యాజమాన్యంలోని వయాకామ్18కు స్టార్ ఇండియా సబ్సిడరీగా మారనుంది.

'సాగు'నీటి ప్రాజెక్టులు!

- కేటాయింపులే తక్కువ
- ఖర్చు ఇంకా తక్కువ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. కేటాయింపులే తక్కువగా ఉంటే, దానిలోనూ చేసిన ఖర్చు ఇంకా తక్కువగా ఉంది. పోలవరం నుంచి గాలేరు నగరి, హంద్రీనీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులు కూడా నెమ్మదిగానే సాగుతున్నాయి. ఎప్పుడో ప్రారంభమైన పథకాలు కూడా 2026 నాటికిగానీ పూర్తి చేయలేమంటూ అధికారులు తేల్చిచెబుతున్నారు. తాజాగా బడ్జెట్ ప్రతిపాదనల కోసం ఆర్థికశాఖకు ఇచ్చిన నివేదికలో పథకాల జాప్యంపై నీటిపారుదల శాఖ అధికారులు వివరించడం గమనార్హం.

ఎప్పుడో పూర్తి కావాల్సిన పోలవరం ప్రాజెక్టు ఇప్పటివరకు కేవలం 74 శాతం మాత్రమే పూర్తయింది. నిధుల లేమి, కాంట్రాక్టర్లను మార్పు చేయడ వంటి అంశాలు ఈ జాప్యానికి కారణంగా భావిస్తున్నారు. నిర్మించిన కొన్ని గేట్లు కూడా కొట్టుకుపోవడం, మరమ్మతులకు లోనుకావడం వంటివి కూడా జాప్యానికి కారణమవుతున్నాయి. అలాగే ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు ముందుగా పునరావాసాన్ని కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే అనేక అడ్డంకుల కారణంగా ఇప్పటివరకు సహాయ పునరావాసం కేవలం 22.42 శాతం మాత్రమే జరిగింది. దీంతో మరో రెండు మూడేళ్లకుగానీ పోలవరం పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు.

ఇక ఉత్తరాంధ్ర జిల్లాల ప్రయోజనాల కోసం ప్రతిపాదించిన బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కూడా వేగంగా అడుగులు వేయడం లేదు. ఇది పూర్తయితే మూడు జిల్లాల్లోని ఎనిమిది లక్షల ఎకరాలకు నీరందుతుంది. పూలసుబ్బయ్య వెలిగొండ పథకంపైనా ఇప్పటికీ కట్టుబడే ఉన్నామంటూ ఆ శాఖ అధికారులు చెబుతుండడం విశేషం.

మరో కీలకమైన గాలేరు నగరి, హంద్రీనీవా పథకాలు కూడా ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. గాలేరు నగరి ఫేజ్-1 పనులు 95 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ మిగిలిన ఐదు శాతం పనులను పూర్తి చేసేందుకు 2025 మార్చి పడుతుందని అంటున్నారు.

ఫేజ్-2 పనులు 63.56 శాతం పూర్తికాగా, మొత్తం పనులు 2026 మార్చికి పూర్తిచేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. హంద్రీనీవా ఫేజ్-1 పనులు 94 శాతం, ఫేజ్-2 పనులు 82 శాతం పూర్తికాగా, వాటికి 2025, 2026 సంవత్సరాల్లో పూర్తి చేయనున్నట్లు చెప్పడం గమనార్హం.

గత ఎన్నికల్లో ఓడిపోవడమే మంచిదైంది

- గెలిచుంటే తలదించుకోవాల్సి వచ్చేది
- దగ్గుబాటి వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి - కారంచేడు (బాపట్ల జిల్లా)

గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి తరుపున పోటీ చేసిన తాను ఓడిపోవడమే మంచిదైందని, పొరపాటున గెలిచి ఉంటే ఎటువంటి అభివృద్ధీ చేయలేక ప్రజల్లో తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చేదని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బాపట్ల జిల్లా కారంచేడులోని చిన్న వంతెన సెంటర్‌లో దగ్గుబాటిపురం గ్రామస్తులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా దగ్గుబాటి మాట్లాడుతూ.. ఎన్నికలైన రెండు నెలలకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన కుమారుడికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి చేస్తానని కబురు పంపినా కూడా తాము వెళ్లలేదని చెప్పారు. ఈ సందర్భంగా తమ రాజకీయ ప్రస్థానం గురించి వివరించారు.

తాను ఓడిపోయినా, గెలిచినా రాష్ట్రానికి, గ్రామాలకు మంచి పని చేయడమే తన ఉద్దేశమని తెలిపారు. కొన్నిమార్లు తాము రాజకీయాల్లో నుంచి ఉపసంహరించుకుందామని ఆలోచన కూడా వచ్చిందన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ.. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అధికారుల అవినీతికి కారకులు సిఎం, మంత్రులే

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారుల అవినీతికి ముఖ్యమంత్రి, మంత్రులే కారకులని, దీనికి సిఎం, మంత్రులు నైతిక బాధ్యత వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లిక్కర్, మైనింగ్, ఇసుక అమ్మకాలు ద్వారా వచ్చిన రూ.కోట్ల సొమ్మును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించినట్లు ఒకపక్క ఆరోపణలు గుప్పుమంటుంటే.. మరోపక్క ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల పర్యటనలకయ్యే ఖర్చులను కిందిస్థాయి అధికారులు, సిబ్బంది సమకూర్చాలంటూ ఒత్తిడి పెంచడం అవినీతికి ఆస్కారమివ్వడమే అవుతుందన్నారు. కేవలం మడకశిర తహశీల్దారును సస్పెండ్ చేయడంతో సమస్య పరిష్కారమైనట్లు కాదన్నారు. మంత్రులు, అధికారులు పర్యటనల సందర్భంగా సభలు, సమావేశాలు భోజన వసతులు ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

గంటలో 4.53 లక్షల టోకెన్ల బుకింగ్

- శ్రీవారికి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి -తిరుమల

మార్చి నెలలో శ్రీవారి దర్శనానికి సంబంధించి టిటిడి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సంబంధించిన టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. 4. 53 లక్షల టోకెన్లు 1.08 గంటలకు అమ్ముడుపోయాయి. దీంతో మార్చి నెలకు సంబంధించి టోకెన్ల విక్రయాల ద్వారా రూ. 15 కోట్లకు పైగా టిటిడికి ఆదాయం లభించింది. అద్దెగదులకు సంబంధించి మధ్యాహ్నం మూడుగంటలకు బుకింగ్ విడుదల చేయగా..గంట వ్యవధిలో యాత్రికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ప్రజా ధనం దుర్వినియోగం

- టిడిపి ఎంపి కనకమేడల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తోందని టిడిపి ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. ప్రభుత్వ పథకాల పేరుతో కుంభకోణాలకు పాల్పడుతూ ఒకలా, పార్టీ కార్యక్రమాలను ప్రభుత్వ కార్యక్రమాలుగా ప్రచారం చేసుకుంటూ మరోలా దుర్వినియోగం చేస్తోందని టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనా వైఫల్యాలు అడుగడుగునా కనబడుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామిక, ప్రాథమిక హక్కులను ప్రభుత్వం ఉల్లంఘిస్తోందన్నారు. పరిశ్రమలను వెళ్లగొట్టడం వల్ల రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. సుమారు రూ.25 లక్షల కోట్లు పెట్టుబడులను రాష్ట్రానికి రాకుండా భయపెట్టి పారిపోయేలా చేశారని ఆరోపించారు. పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం రాష్ట్రంలో డిగ్రీ చదివిన వారిలో నిరుద్యోగ రేటు 24 శాతంగా ఉందన్నారు. గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు లేకపోవడంతో నాలుగేళ్లలో 1,340 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. పోలీసులను ప్రైవేట్ ఆర్మీగా మార్చుకుంటున్నారని విమర్శించారు.

సంపాదకీయం

కమిటీ రద్దుతోనే కాదు

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్లుఎఫ్ఐ) నూతన కార్యవర్గాన్ని రద్దు చేస్తూ క్రీడల మంత్రిత్వశాఖ ఆదివారం నిర్ణయం తీసుకుంది. ఫెడరేషన్ నియంత్రణ, నిర్వహణల కోసం తాత్కాలిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఒఎ)ను కోరింది. మోడీ ప్రభుత్వ ఈ చర్య వెనుక మహిళా రెజ్లర్లు దాదాపు ఏడాది కాలంగా నిర్వహిస్తున్న ఆందోళల ప్రభావం ఉంది. రెజ్లర్ల ఉద్యమానికి వివిధ వర్గాల నుంచి లభిస్తున్న విశాల మద్దతును బిజెపి గ్రహించినట్టుంది. దగ్గరలోనే సార్వత్రిక ఎన్నికలున్న దృష్ట్యా కమిటీ రద్దు నష్ట నివారణ కోసం చేపట్టిన చర్య కింద భావించాలి. రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలుండగా, గురువారం నిర్వహించిన ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల్లో ఆయనకు అత్యంత విధేయుడు, వ్యాపార భాగస్వామి, కరడుగట్టిన ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడూ అయిన సంజయ్ సింగ్ నూతన అధ్యక్షుడయ్యారు. కమిటీలోని 15 స్థానాల్లో 13 బ్రిజ్ భూషణ్ సహచరులకే దక్కాయి. ఈ పరిణామంపై స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగట్ మీడియాముఖంగా కన్నీరు పెట్టుకున్నారు. ప్రముఖ రెజ్లర్ సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. బజరంగ్ పునియా, రవీందర్ సింగ్ యాదవ్ తమకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ అవార్డులను తిరిగి ఇచ్చేస్తామన్నారు. బహుశా, ఈ ఇబ్బందికర పరిస్థితుల వల్లనే కేంద్రం నూతన కమిటీని రద్దు చేసి ఉంటుంది. కమిటీ రద్దుకు క్రీడల మంత్రిత్వశాఖ ఉదహరించిన కారణాలు నామమాత్రమే.

బిజెపి ఎం.పి., డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షునిగా ఉన్న బ్రిజ్ భూషణ్, కోచ్‌లు మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఒలింపిక్ పతక విజేతలైన సాక్షి మాలిక్, బజరంగ్ పునియా, ఫోగట్‌లు నిరసించారు. 2023 జనవరి 18 నుంచి ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద అథ్లెట్లతో కలిసి నెలల పర్యంతం బైఠాయించి ఆందోళన చేశారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వంలో ఉలుకు పలుకు లేదు. మే 28న నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం వద్దకు వెళ్లి తమ గోడు వినిపించేందుకు ప్రయత్నించగా మోడీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా పోలీసులతో అడ్డుకుంది. పతకాలు సాధించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన క్రీడాకారులపట్ల మోడీ సర్కారు వ్యవహరించిన కాఠిన్యం ఇది. దీన్నిబట్టి మహిళలను చెరబట్టిన తమ పార్టీ ఎం.పి.ని ఎంతగా వెనకేసుకొచ్చారో అర్థం చేసుకోవచ్చు. చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకున్న తర్వాతనే ఢిల్లీ పోలీసులు బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసి నెలలవుతున్నా సరైన దర్యాప్తూ లేదు, చర్యలూ లేవు. ఈ లోపే బ్రిజ్ భూషణ్ విధేయుడైన సంజయ్ సింగ్, డబ్ల్యుఎఫ్ఐ కొత్త అధ్యక్షుడు కావడం ఆందోళన చేస్తున్న రెజ్లర్లు ఎంతమాత్రమూ తట్టుకోలేకపోయారు. వాస్తవానికి రెజ్లర్ల ఆందోళన సుదీర్ఘంగా సాగింది. తాము సాధించిన పతకాలను గంగానదిలో కలుపుతామనే వరకూ వెళ్లింది. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకుంటామని మోడీ సర్కారు హామీ ఇవ్వడంతో ఆందోళనలను తాత్కాలికంగా విరమించారు. కాగా 2021 నుంచి డబ్ల్యుఎఫ్ఐ ఎన్నికలు పలు వివాదాల కారణంగా జరగలేదు. మొన్న ఎన్నికైందంటున్న కమిటీ రద్దయింది. కమిటీ రద్దుతోనే లైంగిక వేధింపుల ఆరోపణలు సమసిపోవు. నిందితులు పునీతులూ కారు. డబ్ల్యుఎఫ్ఐని సమూలంగా సంస్కరించి పునర్నిర్మించాలి. అసోసియేషన్లకు కీలక పదవుల్లో ఉన్న వారు, తమ స్థానాలను పదిలపర్చుకునేందుకు రాజకీయ నాయకుల ప్రాపకం కోసం వెంపర్లాడి తోటి క్రీడాకారులకు అన్యాయం తలపెట్టే దుశ్చర్యలు చోటు చేసుకోవడం విచారకరం. రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలపై ఐఒఎ అధ్యక్షురాలు పి.టి. ఉష, దిగ్గజ అథ్లెట్ల కమిషన్ స్పందన ప్రారంభంలో పేలవంగా ఉంది. కమిటీ రద్దుతోనే కేంద్ర ప్రభుత్వ పాత్ర ముగిసిపోలేదు. లైంగిక వేధింపుల ఆరోపణలెదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్, ఇతరులపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే మహిళా క్రీడాకారులకు కాస్తంత భరోసా.

మహనీయుల మాట



తల్లులు మాత్రమే భవిష్యత్తు గురించి ఆలోచించగలరు. ఎందుకంటే వారు తమ పిల్లల్లోనే వీటికి అంకురార్పణ చేస్తారు.

- మక్సిం గోర్కీ
సుప్రసిద్ధ రచయిత

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందపు డొల్లతనం

ప్రభాత్ పట్నాయక్

ఎటువంటి నియంత్రణలూ లేని విధంగా ఒక దేశపు వాణిజ్యం ఇతర దేశాలతో సాగుతోందనుకుందాం. ఆ విధానం వలన ఆ దేశం రెండు రకాల సమస్యలను ఎదుర్కోవచ్చు. మొదటిది: విదే శీ మారకం చెల్లింపులో లోటు. దిగుమతులద్వారా పొందగలుగుతున్న విదేశీ మారకం కన్నా ఎగుమతులకోసం చెల్లించవలసినదే ఎక్కువగా ఉండడం వలన ఈ సమస్య వస్తుంది. రెండవది: దిగుమతులతో దేశీయ ఉత్పత్తులు పోటీ పడలేని స్థితి రావడం వలన దేశీయ ఉత్పత్తి స్థాపక సామర్థ్యం మేరకు జరగకుండా తగ్గిపోతుంది. దాని వలన దేశీయ వనరులు నిరుపయోగంగా ఉండిపోతాయి. ముఖ్యంగా నిరుద్యోగం పెరుగుతుంది. ఈ రెండు సమస్యలూ ఒకేమాదిరివి కావు. నిరుద్యోగం కేవలం దిగుమతులు ఎక్కువైపోయినందువలన మాత్రమే ఏర్పడదు. దిగుమతులకన్నా ఎగుమతులు ఎక్కువగా ఉన్నప్పుడు కూడా ఏర్పడవచ్చు. ఉదాహరణకు: మన దేశం వలసపాలనలో ఉన్న కాలంలో విదేశీ ఉత్పత్తులు మన స్వదేశీ పరిశ్రమలను వృత్తులను దెబ్బ తీశాయి. దాని కారణంగా చేతివృత్తిదారులు, నైపుణ్యం కల పనివారు భారీస్థాయిలో తమ ఉపాధి కోల్పోయారు. ఐతే ఆ కాలంలో దిగుమతులకన్నా మన దేశం చేసిన ఎగుమతులే ఎక్కువ. (ఆ విధంగా ఏర్పడిన మిగులును బ్రిటిష్ పాలకులు స్వాహా చేశారు) ప్రస్తుతం నేను విదేశీ మారక ద్రవ్యం చెల్లింపుల్లో లోటు గురించి చర్చించబోవడం లేదు. ప్రధానంగా నిరుద్యోగ సమస్య గురించి, స్వేచ్ఛా వాణిజ్యంతో దానికి ఉన్న సంబంధం గురించి చర్చిస్తాను.

విదేశీ వాణిజ్యం మీద ఏ విధమైన నియంత్రణా గనుక లేకపోతే దేశంలో నిరుద్యోగం పెరుగుతుందన్నది మూడవ ప్రపంచదేశాలు వలసలు గా ఉండిన కాలంలో చవిచూసిన అనుభవం. ఐనా ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్యం చాలా మంచిది అన్న అభిప్రాయం ఎక్కువగా వ్యక్తం ఔతోంది. ఈ అభిప్రాయానికి బలం చేకూర్చేలా చాలా బూటకపు వాదనను ముందుకు తెస్తున్నారు. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు ఈ తప్పుడు వాదనను ఆధారం చేసుకునే రూపొందాయి. తక్కిన దేశాలకంటే తమకు ఏ సరుకుల ఉత్పత్తిలో పైచేయి ఉండవచ్చునో అటువంటి సరుకుల ఉత్పత్తిలో ఆ దేశం ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించాలి అన్నదే ఆ వాదన. ప్రతీ దేశమూ తాను ఏ సరుకును బాగా ఉత్పత్తి చేయగలదో దానిమీదే కేంద్రీకరిస్తే అప్పుడు ప్రపంచం మొత్తంగా చూసుకున్నప్పుడు ఎక్కువ సరుకులు ఉత్పత్తి అవుతాయి, ప్రతీ దేశమూ ఆ క్రమంలో ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతుంది. - ఇదే స్వేచ్ఛామార్కెట్ వాదన సారాంశం. ఇంతకు మించి వేరే ఇతర వాదనలు దానివద్ద ఏమీ లేవు.

ఇది పూర్తిగా చెత్త. ప్రతీ దేశమూ పూర్తి స్థాయిలో అందరికీ ఉపాధి కల్పిస్తున్నది అని, అందుచేత ప్రపంచం మొత్తం మీద పూర్తి స్థాయిలో ఉపాధికల్పన జరిగిందని ఈ వాదన ఊహిస్తుంది. అటువంటప్పుడు అంతకు ముందు చేసే పనులకు బదులుగా స్వేచ్ఛా వాణిజ్యం వచ్చాక వాళ్ళను ఇతర పనులకు మరలించడమే జరుగుతుంది తప్ప నిరుద్యోగం తలెత్తే సమస్యే ఉత్పన్నం కాదు అన్నది దాని తాత్పర్యం.

ఈ వాదన ప్రాతిపదికకు వాస్తవంలో గాని, సిద్ధాంతరీత్యా గాని ఎటువంటి ఆధారమూ లేదు. 1930 దశకంలోనే మైఖేల్ కాలెక్కీ, జాన్‌మేనార్డ్ కీన్స్ ఈ స్వేచ్ఛావాణిజ్య సిద్ధాంతపు డొల్లతనాన్ని సైద్ధాంతికంగా ఎండగట్టారు. నిజానికి అంతకు 75 సంవత్సరాలకు మునుపే మార్క్స్ అటువంటి స్థితి వస్తుందని అంచనాకు వచ్చాడు. స్వేచ్ఛావాణిజ్యం ఒక దేశానికి ఎటువంటి హాని కలిగిస్తుందో ముందే స్పష్టంగా తేలిపోయింది.

దీనిని తేలికగా వివరించడానికి ఒక ఉదాహరణను తీసుకుందాం. మొత్తం ప్రపంచం ఉత్పత్తి సామర్థ్యం 100 యూనిట్లు అనుకుందాం. ప్రపంచ మార్కెట్ మొత్తం డిమాండ్ 80 యూనిట్లు అనుకుంటే అప్పుడు మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 20 యూనిట్లు చెల్లకుండా మిగిలిపోతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో డిమాండ్ ను బట్టే ఉత్పత్తి జరుగుతుంది గనుక 20 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం మేరకు పని జరగకుండా ఆగిపోతుంది. అలా మిగిలిపోయిన వనరులు ఆ యా దేశాలలో ఉండిపోతాయి.

ఇక్కడ ఒక ప్రశ్న రావచ్చు. నిరుద్యోగాన్ని పెంచే పెట్టుబడిదారీ విధానంతో విసుగెత్తిపోతే కార్మికులు సోషలిజంవైపు మొగ్గు చూపుతారు కనుక పెట్టుబడిదారీ ప్రభుత్వమే జోక్యం కల్పించుకుని మార్కెట్ లో జోక్యం కల్పించు కుని డిమాండ్ పెరిగేలా, తద్వారా కార్మికులందరికీ ఉపాధి లభించేలా చూడాలని కీన్స్ సూచించాడు. ఒక దేశంలో ఆ విధంగా చేయగలిగేటప్పుడు యావత్తు ప్రపంచ స్థాయిలోనే అటువంటి ప్రయత్నం చేసి పూర్తి 100 యూనిట్ల ఉత్పత్తి మేరకు డిమాండ్ ను పెంచి తద్వారా పూర్తిస్థాయి ఉపాధికల్పన జరిగేట్టు చూడవచ్చుకదా ? అప్పుడ ఏ దేశంలోనూ ఉత్పత్తి వనరులు మిగిలిపోవు కదా ?

ఈ ప్రశ్నకు ఒకే ఒక, సూటి అయిన సమాధానం ఉంది. ఆ విధంగా జరగాలంటే ప్రపంచం మొత్తం ఒక రాజ్యంగా ఉండాలి. ప్రపంచం మొత్తం మీద ఒక ప్రభుత్వం ఉండాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండగా అటువంటిది జరగదు. అటువంటప్పుడు ఏ యే దేశాలలో ఉత్పత్తి సామర్థ్యం పూర్తిగా వినియోగంలోకి రాకుండా ఉండిపోతుందో, ఆ యా దేశాల ప్రభుత్వాలు తమ మార్కెట్ డిమాండ్ ను పెంచడానికి, తద్వారా ఎక్కువగా ఉపాధి కల్పించడానికి పూనుకోవచ్చు. ఐతే స్వేచ్ఛావాణిజ్యం అమలులో ఉన్నందువలన, మార్కెట్ లో పెరిగిన డిమాండ్ ను కేవలం దేశీయంగా ఉత్పత్తి అయే సరుకులే అందుకుంటాయని చెప్పలేం. విదేశీ సరుకుల దిగుమతులు పెరిగి ఆ డిమాండ్‌ను తామే అందుకోవచ్చు. దానివలన ఆ దేశానికి దిగుమతులు పెరిగి వాణిజ్య లోటు భారం పెరుగుతుందే తప్ప తన ఉత్పత్తి సామర్థ్యం పెరగడం మాత్రం జరగదు. ఆ దేశాలు గనుక స్వేచ్ఛా వాణిజ్యం పరిధిలోకి లేకుండా ఉండివుంటే విచ్చలవిడి దిగుమతులను నిరోధించి దేశీయ సరుకుల డిమాండ్ ను, తద్వారా ఉపాధి అవకాశాలను పెంచుకోవచ్చు. కాని, ఇప్పుడు స్వేచ్ఛావాణిజ్యం ఆ దేశాలను కట్టిపడేసింది.

ఇలా స్వేచ్ఛావాణిజ్యం కారణంగా ఆ యా దేశాలు తమ తమ మార్కెట్ డిమాండ్ ను, తద్వారా తమ దేశీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేలా జోక్యం చేసుకోలేని అశక్తతలోకి పడిపోయాయంటే దానర్థం స్వేచ్ఛావాణిజ్యం వచ్చాక కలిగిన ఉపాధి అవకాశాలకన్నా, స్వేచ్ఛావాణిజ్యం లేకుండావుండి వుంటే రక్షణ చర్యలద్వారా ఎక్కువ ఉపాధిఅవకాశాలను కల్పించుకోగలిగి వుండేవి అన్నమాట.

> **విదేశీ వాణిజ్యం మీద ఏ విధమైన నియంత్రణా గనుక లేకపోతే దేశంలో నిరుద్యోగం పెరుగుతుందన్నది మూడవ ప్రపంచదేశాలు వలసలు గా ఉండిన కాలంలో చవిచూసిన అనుభవం. ఐనా ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్యం చాలా మంచిది అన్న అభిప్రాయం ఎక్కువగా వ్యక్తమవుతోంది. ఈ అభిప్రాయానికి బలం చేకూర్చేలా చాలా బూటకపు వాదనలను ముందుకు తెస్తున్నారు. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు ఈ తప్పుడు వాదనను ఆధారం చేసుకునే రూపొందాయి. తక్కిన దేశాలకంటే తమకు ఏ సరుకుల ఉత్పత్తిలో పైచేయి ఉండవచ్చునో అటువంటి సరుకుల ఉత్పత్తిలో ఆ దేశం ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించాలి అన్నదే ఆ వాదన**

స్వేచ్ఛావాణిజ్య సమర్థకులు ముందుకు తెచ్చిన వాదన ప్రకారం ప్రతీ దేశమూ తనకు ప్రత్యేక సామర్థ్యం కల సరుకులను ఉత్పత్తి చేయడం మీద కేంద్రీకరిస్తే అప్పుడు మొత్తం ప్రపంచ ఉత్పత్తి పెరుగుతుంది. అప్పుడు అన్ని దేశాలకూ లాభం ఒనగూరుతుంది. కాని మన పరిశీలనలో స్వేచ్ఛావాణిజ్యం అమలులోకి వచ్చాక అంతకు మునుపటి ప్రపంచ డిమాండ్ కన్నా తక్కువస్థాయికి డిమాండ్ పడిపోతుందని తేలింది.

అసలు స్వేచ్ఛావాణిజ్యం అమలులో ఉన్నప్పుడు ప్రపంచ స్థూల డిమాండ్ అనేది దేనిమీద ఆధారపడివుంటుంది? ప్రపంచ స్థూల డిమాండ్ ను ప్రాథమికంగా నిర్ణయించేది ప్రపంచం మొత్తం మీద అగ్రస్థానంలో ఉన్న పెట్టుబడిదారీ దేశం. ప్రస్తుతం అది అమెరికా. అమెరికా ఇప్పుడు డిమాండ్ ను సృష్టించడం విషయంలో చాలా ఎక్కువ స్వయంనిర్ణయాధికార శక్తి కలిగివుంది. అలా పెంచిన డిమాండ్‌లో కొంత భాగాన్ని ఇతర దేశాల ఉత్పత్తులు కాజేయవచ్చుగాక. అయినా అమెరికాకి ఏమీ బెంగ లేదు. ఎందుకంటే విదేశీ వాణిజ్య లోటు పెరిగిపోతుందనే భయం దానికి లేదు. డాలర్ ను బంగారంతో సమానంగా ప్రపంచం పరిగణిస్తూ తమ తమ డాలర్ నిల్వలను ఆ యా దేశాలు పెంచుకోడానికి ప్రయత్నిస్తున్నంతకాలమూ అమెరికా కావలసినన్ని డాలర్లను ముద్రించుకోవచ్చు.

అందుచేత అమెరికాలోని వినిమయం + పెట్టుబడులు + ప్రభుత్వ వ్యయం కలిస్తే ప్రపంచ స్థూల డిమాండ్ ను నిర్ణయించే ప్రాథమికాంశంగా ఉంటుంది. అమెరికన్ ప్రభుత్వం చేసే వ్యయం మీద నియంత్రణ వేరే ఏమీ ఉండదు. కొళాయి ఇప్పినట్టు ఇప్పుకోవచ్చు. వర్తమాన పెట్టుబడిదారీ ప్రపంచంలో తక్కిన పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలపై సూపర్ ప్రభుత్వం మాదిరిగా ఒకమేరకు అమెరికా వ్యవహరించగలుగుతోంది. అంటే ఒక విధమైన ప్రపంచ ప్రభుత్వం మాదిరిగా వ్యవహరిస్తోంది.

ఐతే, ఈ విషయంలో ఇప్పుడు ఒక వైరుధ్యం తన ప్రభావాన్ని చూపడం మొదలుబెడుతోంది. ఎంతగా తక్కిన దేశాలమీద పెత్తనం చెలాయించగలుగుతున్నా, మౌలికంగా అమెరికా కూడా ఒక జాతిరాజ్యంగానే ఉంది. అందుచేత అమెరికన్ ప్రభుత్వం దేశీయ డిమాండ్ ను పెంచుకుంటూ పోతే, ఆ డిమాండ్ లో కొంత భాగం విదేశీ దిగుమతుల ద్వారా భర్తీ అవుతుంది. అప్పుడు అమెరికా వాణిజ్యలోటు పెరుగుతుంది. ఆలోటును అమెరికన్ ప్రభుత్వం భర్తీ చేయవచ్చు. కాని ఆ క్రమంలో అమెరికా ప్రభుత్వం అప్పులపాలవుతుంది. ఐనా ఆ దేశానికేమీ ఢోకా లేకపోవచ్చు. కాని అప్పులపాలౌతూ తన ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతూవుంటే దాని ఫలితంగా కలిగే ఉపాధిలో కొంత భాగం విదేశాలకు చెందుతోంది. ఇలా ఇతరదేశాలలో ఉపాధి కల్పన కోనం మనం ఎందుకు అప్పులపాలవ్వాలి? అన్న ప్రశ్న అమెరికాలో ఒక జాతీయ దృక్పథం నుంచి చూసినప్పుడు తలెత్తుతోంది. ఒక జాతి రాజ్యంగా తనకున్న బాధ్యతకు, అంతర్జాతీయంగా సూపర్ ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నదానికి మధ్య వైరుధ్యం తలెత్తుతోంది.

ఈ వైరుధ్యం ఇటీవల కొంత తీవ్ర రూపం దాల్చుతోంది. కరోనా కాలంలో తక్కిన సంపన్న దేశాల మాదిరిగానే అమెరికా కూడా తమ ప్రజానీకానికి సహాయం అందించడం కోసం భారీగా ద్రవ్యలోటు పెంచి వ్యయం చేసింది. కరోనా నెమ్మదించిన తర్వాత కాలంలో కూడా దేశీయ స్థూల డిమాండ్ ను పెంచడం కోసం ఆ భారీ ద్రవ్యలోటును కొనసాగించాలని చూసింది. కాని ఈ మధ్య తీవ్రంగా ద్రవ్యోల్బణం తలెత్తడంతో కొంత వెనక్కు తగ్గింది. ఐతే, ఈ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టగానే మళ్ళీ ద్రవ్యలోటును పెంచడానికి పూనుకుంటుంది. ఐతే, ఈ మారు తమ దేశీయ డిమాండ్ పెరగడం ఇతర దేశాలలో ఉపాధిఅవకాశాల పెరుగుదలకు కాకుండా తమ దేశంలోనే పెరిగేవిధంగా కొన్ని రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే ఈ రక్షణ విషయంలో చైనా పట్ల కొన్ని చర్యలు తీసుకుంది. ఇప్పుడు తక్కిన మూడవ ప్రపంచదేశాల విషయంలో కూడా అదేమాదిరిగా వ్యవహరించనుంది. ఈ ధోరణిని కొందరు ప్రపంచీకరణ-వ్యతిరేక క్రమం అంటూ అభివర్ణిస్తున్నారు. కాని అది సరైనది కాదు. సరుకుల దిగుమతి విషయంలో రక్షణ చర్యలకు అమెరికా పూనుకుంటోందే తప్ప ద్రవ్య పెట్టుబడి స్వేచ్ఛగా సంచరించే విషయంలో ఏ ఆంక్షలనూ విధించడం లేదు. పైగా మరేదైనా దేశం గనుక ద్రవ్య పెట్టుబడి కదలికలపై ఆంక్షలకు పూనుకుంటే అమెరికా ఆ దేశాన్ని శిక్షిస్తోంది. ఈ మాదిరి వైరుధ్యాలను అమెరికా పెద్దగా పట్టించుకోదు. తక్కిన అన్ని దేశాలకూ స్వేచ్ఛావాణిజ్యం గురించి గొప్పగా చెప్తుందే తప్ప తనవద్దకు వచ్చేసరికి మాత్రం అది రక్షణ విధానాన్నే పాటిస్తోంది కదా.

(స్వేచ్ఛానుసరణ)

అలుపెరుగని పోరాట యోధుడు

నివాళి

జి. కిషోర్ కుమార్

ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) అగ్ర నాయకులు, ఐదు దశాబ్దాల పైగా ఇన్సూరెన్స్ ఉద్యోగుల పోరాటాలలో, దేశ కార్మికోద్యమంలో ప్రత్యేక స్థానాన్ని సముపార్జించుకున్న ఎఐఐఇఎ మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్. సుందరం ఆరవ వర్ధంతి నేడు.

ఎఐఐఇఎ దిగ్గజం ఎన్.ఎమ్. సుందరం 1938 జనవరి8న జన్మించారు. 1957లో ఎల్ఐసి లో ప్రొబేషనరీ అసిస్టెంట్‌గా చేరారు. ఆయన తండ్రి టి.ఆర్. నారాయణన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యుఐ) ప్రముఖ నాయకులు. సుందరం 1961లో సౌత్ జోన్ (ఎస్‌జెడ్ఐఇఎఫ్) కు జాయింట్ సెక్రటరీగా, 1963లో అతిచిన్న వయసులోనే ప్రధాన కార్యదర్శిగా, 1972లో ఎఐఐఇఎ జాయింట్ సెక్రటరీగా, 1988 నుండి 2003 వరకు ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2007 వరకు ఎఐఐఇఎ అధ్యక్షులుగా వివిధ బాధ్యతలలో అయిదు దశాబ్దాలకు పైగా ఆయన యూనియన్ ప్రస్థానం కొనసాగింది.

సరోజ్ చౌధురి, చంద్రశేఖర్ బోస్, సునీల్ మైత్రా వంటి హేమాహేమీల మార్గదర్శకత్వంలో సుందరం తీర్చిదిద్ద బడ్డారు. ఆయన వాక్‌చాతుర్యం, వాదనాపటిమ, రచనా సామర్థ్యం, నిర్మాణ దక్షత, తాత్వికత, విశ్లేషణా నైపుణ్యం, మానవతావాద దృక్పథం ఆయనను సమున్నత శిఖరాలు చేరుకోడానికి దోహదం చేశాయి. ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఉద్యమం కేవలం జీతభత్యాల పెంపుదల కోసమే పరిమితం కాకుండా సంస్థ పురోగతి కోసం, జాతీయ బీమా రంగ పరిరక్షణ కోసం, సామాజిక లక్ష్యాల సాధన కోసం, విశాల ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఐక్యత కోసం పోరాట పంథాను నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకువెళ్ళటంలో ఆయన పాత్ర అమోఘం.



ఎన్ ఎం సుందరం ఆరవ వర్ధంతి నేడు

బీమారంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, మల్హోత్రా సిఫార్సులను వ్యతిరేకిస్తూ ప్రజానీకం నుంచి 1.54 కోట్ల సంతకాలను సేకరించి పార్లమెంట్‌కు సమర్పించటంలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన ఉద్యమ నిర్మాణ దక్షతకు ఇదొక నిదర్శనం. ఈ ఉద్యమం ద్వారా ప్రజాచైతన్యంతో ప్రైవేటీకరణ విధానాలను నిలువరించవచ్చని ప్రపంచానికి చాటిచెప్పారు. వేతన సాధన కమిటీకి కన్వీనర్‌గా బేసిక్ పే, డిఎ ఫార్ములా, ప్రమోషన్స్ రూల్స్‌లో ప్రముఖ రూపశిల్పిగా, మేనేజ్‌మెంట్ పేయింగ్ కెపాసిటిని బట్టి ఉద్యోగస్తుల యొక్క ఆర్థిక ఆకాంక్షలను సాకారం చేయడంలో, రిక్రూట్‌మెంట్, సిజిఐటి, ఎన్ఐటి వంటి అంశాలలో ఎల్ఐసిని ప్రభుత్వరంగ సంస్థగా కాపాడటంలో, దానిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో సుందరం అద్వితీయమైన పాత్ర పోషించారు. ఆయన నేతృత్వంలో జరిగిన ప్రచార, పోరాట, ఆందోళనా ఉద్యమాలే ఈరోజు ఇండస్ట్రీలో మనం అనుభవిస్తున్న వివిధ సదుపాయాలు, సౌకర్యాలకు ప్రాతిపదిక.

ఎన్ఎం సుందరం నాయకత్వంలో, ఫైనాన్షియల్ సెక్టార్‌లో కీలకమైన బ్యాంకింగ్, బీమా రంగాల ఉద్యోగులను జాయింట్ యాక్షన్ కమిటీ జెఎసిగా ఏర్పాటుచేసి పెన్షన్ సాధనకోసం సాగించిన పోరాటం, బీమా ఉద్యోగులకు పెన్షన్ సాధించటం లో ఆయన కృషి ఎనలేనిది.. కా॥ ఎన్ ఎం సుందరం భారత కార్మికోద్యమంలో చేస్తున్న అవిశ్రాంత కృషిని, ఆయన అపారమైన మేథోసంపత్తిని గుర్తించిన ప్రపంచ కార్మిక వర్గం ఆయనను అనేక అంతర్జాతీయ సదస్సులకు ఆహ్వానించింది. బల్గేరియా, క్యూబా వంటి దేశాలలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సదస్సులలో సుందరం పాల్గొని ఎఐఐఇఎవాణిని గట్టిగా వినిపించారు. 'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్' (డబ్ల్యుఎఫ్‌టియు) లో ఎఐఐఇఎ కు ప్రత్యేక గుర్తింపుతేవడంలో సుందరం ప్రత్యేక పాత్ర వహించారు. 'ఏషియన్ సోషల్ ఫోరమ్', 'వరల్డ్ ఎకనమిక్ ఫోరం' వంటి వేదికలమీద ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలతో కూడిన ప్రసంగాలతో యావత్ ప్రపంచ కార్మికవర్గాన్ని ఆకట్టుకున్న విజ్ఞాన గని సుందరం.

గ్లోబలైజేషన్, కమ్యూనలైజేషన్ విధానాల విపత్తును దూరదృష్టితో అంచనావేసి ఈ విధానాలను ప్రతిఘటించేందుకు మేధావులు, అభ్యుదయవాదులు, ప్రగతికాముకులతో 'పీపుల్ ఫర్ ఇండియా' వంటి విశాల వేదికలను రూపొందించాలనే ఆలోచనకు ఆద్యులు ఆయనే. లక్షలాదిమంది ఇన్సూరెన్స్ ఉద్యోగుల పత్రిక 'ఇన్సూరెన్స్ వర్కర్'కు సుదీర్ఘకాలంపాటు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 'లెటజ్ ప్లే పాలిటిక్స్' శీర్షికతో సమకాలీన జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ, ఆర్థిక అంశాలపై వందకుపైగా విశ్లేషణాత్మక వ్యాసాలను రాశారు.

వివిధ యూనివర్శిటీలు, కాలేజీలు, ట్రేడ్ యూనియన్లు, జాతీయ, అంతర్జాతీయ వేదికలు నిర్వహించిన వందలాది సెమినార్లలో సుందరం పాల్గొన్నారు. కళలు, సంస్కృతి, క్రీడా రంగాలతో పాటు ఆర్థికశాస్త్రంలో ప్రావీణ్యత కలిగిన సుందరం రాసిన పుస్తకాలు బహుళ ప్రాచుర్యాన్ని పొందాయి. "Fragility of Global Finance Capital", "Politics of Anti-development", "Global Finance Capital on Rampage", "Imperialism - Yesterday and Today", "In Defence of Public Sector LIC and GIC" వంటివి వాటిలో ప్రముఖమైనవి. చురుకైన కార్యకర్తల్ని గుర్తించి, వారిని ప్రోత్సహించి అనేకమందిని నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా తీర్చిదిద్దారు. బ్యాంకింగ్, మెడికల్, టెలికమ్, సెంట్రల్ గవర్నమెంట్, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మిక వర్గాన్ని ఐక్యం చేయటానికి, ఫైనాన్షియల్ సెక్టార్ ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటి, నేషనల్ ఫ్లాట్‌ఫామ్ ఆఫ్ మాస్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పిఎంఓ) జాతీయ కార్మిక సంఘాలతో కలిసి దేశవ్యాప్త ఐక్య ఉద్యమాల నిర్మాణానికి, విశాల ట్రేడ్ యూనియన్ ఐక్యతకు, జాతీయ సమ్మెలు విజయవంతం చేయడానికి విశేషమైనటువంటి కృషిచేసిన విశిష్ట వ్యక్తిత్వం సుందరం సొంతం. ఆయన ఆశయాలకు పునరంకితం కావడమే ఆ మహనీయునికి అర్పించే నిజమైన నివాళి.

వ్యాస రచయిత ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఎల్ఐసి ఉద్యోగ సంఘం) జాయింట్ సెక్రటరీ.
9440905501

మేమూ మనుషులమేనని నిరూపించుకోవాలి

యుద్ధ నీతిని మన పెద్దన్న లు గాలికి వదిలేశారు ..!
జనారణ్యంలోకి దారుణ బాంబులు విసరొద్దన్న
నియమావళిని వారు తుంగలో తొక్కారు ..!?

ప్రతీకార జ్వాలతో రగిలి శత్రు దేశాలపై
వరుస బాంబుల వర్షం కురిపించి
రణ దాహాన్ని తీర్చి కుంటున్నారు రక్త పిపాసులు ..!

ఇజ్రాయిల్ పాలస్తీనా మధ్య జరిగిన సమరంలో
పాలస్తీనా లోని నాజూకు గాజా ప్రాంతం
గాజు పాత్రలా భళ్ళున పగిలిపోయింది..!

ఇరు దేశాల నడుమ జరిగిన యుద్ధంలో
ఇరవై వేల మంది ప్రజలు హతం
లక్ష లాది జనత నిరాశ్రయులు
వలసబాట పట్టిన వేలాదిమంది పాలస్తీనియన్లు

పాలు లేక అల్లాడుతున్న పసిపిల్లలు
కాళ్ళు తెగి విలవిలలాడు తున్న యువత
మందు బిళ్ళలు అందక రోదిస్తున్న వృద్ధులు
మంచి నీరు చాలక, ఆహారం దొరకక
ఆర్త నాదాలు చేస్తున్నారు గాజా లోని జనత ...!

అగ్ర దేశాల ఉగ్ర నేతల్లారా..!
మీ యుద్ధ వాంఛ చివరికి నెర వేరింది..!
యుద్ధం లో రక్త పు ముద్దలుగా పడివున్న
క్షత గాత్రులను క్షమా గుణంతో ఆదరించండి
బాధితులను మానవతా దృష్టి తో చూసి
మేమూ మనుషులమే అని ఇకనైనా నిరూపించుకోండి ..!

..జి.సూర్యనారాయణ, 6281725659.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

పార్లమెంటరీ సంస్థలు నిర్వీర్యం

- మోడీ పాలనలో దిగజారిన ప్రజావ్యవస్థ
- రాష్ట్రాలే నయమంటున్న పరిశీలకులు

న్యూఢిల్లీ : గత వారం పార్లమెంట్ నుంచి ప్రతిపక్ష సభ్యులను బయటికి గెంటేసిన తర్వాత కొన్ని కీలక బిల్లులకు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. వీటిలో ఐపిసి, ఇండియన్ ఎవిడెన్స్ చట్టం, సిఆర్‌పిసి, ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం, ఇండియన్ వైరెలెస్ టెలిగ్రఫీ చట్టం ఉన్నాయి. ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు కట్టబెట్టే కొత్త బిల్లును కూడా పార్లమెంట్ ఆమోదించింది. దేశంలో క్రిమినల్ చట్టాల నిర్మాణం, ఇంటర్నెట్ సేవలపై నియంత్రణ, ఎన్నికల నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం తన పంతం నెగ్గించుకుంది. ఏ ప్రజాస్వామ్య దేశంలో అయినా కీలక అంశాలపై విధానపరమైన మార్పులు చేసే ముందు ప్రజాభిప్రాయాన్ని స్వీకరిస్తారు. దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చ జరుపుతారు. ఇవేమీ చేయకపోగా కనీసం చట్టసభలో నిస్పాక్షికంగా ఓటింగ్ కూడా జరపలేదు. పైగా ప్రతిపక్ష సభ్యులు సభలో లేకుండా చేసి మరీ కేంద్రం బిల్లులను ఆమోదించుకోవడాన్ని చూస్తుంటే ఫీల్డర్లను క్రికెట్ మైదానం నుండి బయటికి పోవాలని ఆదేశించి, ఆ తర్వాత బ్యాటర్ సెంచరీ చేసినట్లు ఉంది.

దేశంలో ప్రజాస్వామ్యం కూనారిల్లిపోతోందని చెప్పడానికి పార్లమెంటులో ప్రతిపక్షం లేకుండా చేయడానికి చేసిన ప్రయత్నమే ఉదాహరణ. గడచిన దశాబ్ద కాలంలో పేలవమైన పనితీరును కనబరుస్తూ, ప్రజల్లో అప్రదిష్ట మూటకట్టుకుంటున్న కేంద్ర సంస్థల్లో ఇప్పుడు పార్లమెంట్ కూడా చేరింది. ఇప్పటికే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పనితీరుపై పలు ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. రాజకీయ నాయకులు దుందుడుకుగా, అతిగా ప్రవర్తిస్తే వారికి కళ్లెం వేయడానికి సుప్రీంకోర్టుకు అధికారం ఉంది. అయితే నరేంద్ర మోడీ హయాంలో ఆ పని జరగడం లేదు. పెద్ద నోట్ల రద్దు, కాశ్మీర్ హోదాను కేంద్ర పాలిత ప్రాంతానికి కుదించడం, ఎన్నికల బాండ్లు, పౌరసత్వ సవరణ చట్టం... ఇలాంటి వివాదాస్పద విధానాలన్నింటికీ సుప్రీంకోర్టు రబ్బరు స్టాంపు వేయడమో లేదా దాటవేయడమో జరిగింది తప్ప వాటిని తోసిపుచ్చింది లేదు.

ఎన్నికల కమిషన్ నిర్వహణ విషయంలో కూడా ఇలాంటి స్వతంత్రతే కొరవడింది. అధికార పార్టీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదులు, నిపుణులు వ్యక్తం చేసిన ఆందోళనలు అరణ్యరోదనే అయ్యాయి. ఇప్పుడు తీసుకొచ్చిన నూతన చట్టం ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్రానికే అధికారాలు దఖలు పరిచింది. ఇదెలా ఉందంటే తనకు ఇష్టం వచ్చిన వారిని క్రికెట్ అంపైర్లుగా బ్యాటర్ నియమించినట్లుంది. న్యాయస్థానాలు పట్టించుకోకపోవడం, ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలు పాలకుల రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం దేనికి సంకేతం? అధికార పక్ష నేతలు ఎన్ని తప్పులు చేసినా కిమ్మనని దర్యాప్తు సంస్థలు రాజకీయ ప్రత్యర్థులపై మాత్రం ఒంటికాలుపై లేస్తున్నాయి. ఇదంతా బహిరంగంగా జరుగుతున్న తంతే. మోడీ పాలనలో ప్రజాస్వామ్యం పరిస్థితి నానాటికి తీసికట్టు...నాగం భొట్టు మాదిరిగా తయారైంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు పాలకుల జేబు సంస్థలుగా మారిపోయాయి.

పెరిగిన రాష్ట్రాల ప్రాధాన్యత

అనేక రాష్ట్రాలలో కూడా ప్రభుత్వ సంస్థల పనితీరు ఇలాగే ఉన్నప్పటికీ ఇంతలా దిగజారలేదు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో కేంద్ర సంస్థలే బలంగా ఉన్నాయి. అయితే రాష్ట్రాలలోనే తొలుత ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రారంభమయ్యాయి. బ్రిటీష్ వారు 1937లో ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత రాష్ట్ర అసెంబ్లీలు రాజ్యాంగ అసెంబ్లీని ఎన్నుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్రాలపై పెత్తనం చెలాయించింది. 1980వ దశకం చివరలో కాంగ్రెస్ ప్రాభవం తగ్గిపోవడం మొదలైంది. దీంతో దేశంలో సమాఖ్యతత్వం, రాష్ట్ర రాజకీయాలు బలపడ్డాయి. ఆర్థిక రంగంలో కూడా రాష్ట్రాల ప్రాధాన్యత పెరిగింది. కేంద్ర వ్యయంతో పోలిస్తే రాష్ట్రాలు పెట్టే ఖర్చే ఆర్థిక ప్రభావం చూపింది. 1990వ దశకం నుంచి కేంద్రంతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వాలకే ప్రజలు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభమైంది. ముస్లింలు, దళితులు, పేదలు రాష్ట్ర ప్రభుత్వాలనే ఎక్కువగా విశ్వసించారు.

జాతీయ స్థాయి ఎన్నికలతో పోలిస్తే రాష్ట్ర స్థాయిలో జరిగే ఎన్నికల పైనే ప్రజలకు ఆసక్తి అధికంగా ఉంటోంది. దీనికి ఉదాహరణ లోక్‌సభ ఎన్నికల కంటే శాసనసభ ఎన్నికలలోనే ఓటింగ్ శాతం ఎక్కువగా ఉండడమే. అర్థ శతాబ్దం క్రితం పార్లమెంటే అత్యుత్తమమైన చట్టసభగా పేరు గాంచింది. కానీ ఈ రోజు పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉంది. పార్లమెంట్‌లో కంటే రాష్ట్ర శాసనసభలలోనే కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు. పరిశీలకులూ అదే చెబుతున్నారు. ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో మూకుమ్మడిగా ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేశారు. రాష్ట్ర శాసనసభలలో ఇలాంటి వాతావరణం ఎన్నడూ కన్పించలేదు.

ఆర్మీ అదుపులో ముగ్గురు మృతిపై హత్య కేసు

- తీవ్ర విమర్శలతో జమ్ము కాశ్మీర్ పోలీసుల చర్య

శ్రీనగర్ : ఆర్మీ అదుపులోకి తీసుకున్న ముగ్గురు తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై జమ్ముకాశ్మీర్ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. పూంచ్ జిల్లాలోని సూరంకోట్ పోలీస్ స్టేషన్‌లో ఐపిసి సెక్షన్ 302 కింద గుర్తుతెలియని వ్యక్తులపై హత్య కేసు నమోదు చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. పూంచ్ జిల్లాలో ఈ నెల 21న ఉగ్రదాడిలో ఐదుగురు సైనికులు మరణించిన ఘటన జరిగిన తరువాత రోజు సమీప గ్రామం నుంచి విచారణ కోసం ఎనిమిదిమందిని సైన్యం అదుపులోకి తీసుకుంది. వీరంతా గుజ్జార్ సామాజిక వర్గానికి చెందిన వారు. వీరిలో ముగ్గురు తీవ్రగాయాలతో శుక్రవారం మరణించగా, మిగిలిన ఐదుగురు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరగడంతో పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు.

గృహనిర్బంధంలో ముఫ్తీ

పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీని సోమవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆర్మీ కస్టడీలో ముగ్గురు పౌరులు మరణించిన పూంచ్ జిల్లాలో పర్యటనను అడ్డుకోవడానికే పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారని పిడిపి ఒక ప్రకటనలో విమర్శించింది. 'పూంచ్ జిల్లా పర్యటనకు ముందు మెహబూబా ముఫ్తీని బలవంతంగా గృహనిర్బంధంలో ఉంచారు. పూంచ్ జిల్లాలో పరిస్థితిని సమీక్షించడానికి, బాధితుల్ని ఓదార్చడానికి ఆమె అక్కడ పర్యటించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు' అని పిడిపి ట్వీట్ చేసింది. ముఫ్తీని అన్యాయంగా గృహనిర్బంధించడాన్ని పిడిపి తీవ్రంగా ఖండిస్తుందని తెలిపింది. పర్యటనను అడ్డుకోవడానికి ఇలాంటి ఆంక్షలు అసంబద్ధమైనవని విమర్శించింది.

తమిళనాడులో ఇడి అధికారులపై కేసు నమోదు

చెన్నై: తమిళనాడు పోలీసులు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులపై కేసు నమోదు చేశారు. ఇడి అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారంటూ డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ (డివిఎసి) అధికారులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకొన్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని మదురైలో ఇడి అధికారిగా పని చేస్తున్న అంకిత్ తివారీని లంచం కేసులో ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా డివిఎసి అధికారులు తనిఖీల నిమిత్తం స్థానిక ఇడి కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సోదాలు చేస్తున్న సమయంలో ఇడి అధికారులు తమను అడ్డుకున్నారని డివిఎసి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇడి అధికారులపై మదురై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. నిందితుడైన ఇడి అధికారి అంకిత్ తివారీ ఓ ప్రభుత్వ అధికారి ఆస్తులకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా తొలుత రూ.3 కోట్లు డిమాండ్ చేశాడు. ఆ తర్వాత రూ.51 లక్షలైనా ఇవ్వాలన్నాడు. చివరికి ఒప్పందంలో భాగంగా రూ.20 లక్షల లంచం తీసుకుంటుండగా.. అంకిత్‌ను డివిఎసి అధికారులు పట్టుకున్నారు.

మధ్యప్రదేశ్ క్యాబినెట్ విస్తరణ..

- మంత్రులుగా 28 మంది ప్రమాణస్వీకారం

భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తన క్యాబినెట్‌ను సోమవారం విస్తరించారు. కొత్తగా 28 మందిని తన క్యాబినెట్‌లో చేర్చుకున్నారు. వారి 18 మంది క్యాబినెట్ మంత్రులుగా, ఆరుగురు స్వతంత్రులుగా, మిగతా నలుగురు సహాయ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మధ్యప్రదేశ్ క్యాబినెట్‌లో ముఖ్యమంత్రితో కలిపి మొత్తం 35 మందికి చోటు కల్పించే అవకాశం ఉంది. సీఎం మోహన్ యాదవ్ కొత్తగా క్యాబినెట్‌లోకి తీసుకున్న 28 మందితో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ సీ పటేల్ ప్రమాణస్వీకారం చేయించారు. క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణం చేసిన 18 మందిలో ప్రద్యుమన్ సింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, కైలాస్ విజయవర్గీయ, విశ్వాస్ సారంగ్ ఉన్నారు. ఆరుగురు స్వతంత్ర హోదా మంత్రులుగా అవకాశం కల్పించారు. మరో నలుగురిని సహాయ మంత్రులుగా తీసుకున్నారు.

లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యం

- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ : 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న అంతర్జాతీయ సమాజ లక్ష్యాన్ని చేరుకోవడం మన దేశానికి ఆచరణ సాధ్యం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తేల్చేసింది. కార్మికులు, జౌళి, నైపుణ్యాభివృద్ధిపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ తన 52వ నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశంలో పనిచేస్తున్న బాల కార్మికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ధారణకు వచ్చింది. కమిటీ తన నివేదికను ఇటీవలే పార్లమెంటుకు సమర్పించింది. అంతర్జాతీయ సమాజం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే కార్యాచరణ ఆధారిత విధానాన్ని రూపొందించుకొని పట్టుదలతో ముందుకు సాగాలని కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు సూచించింది.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి భర్తృహరి మహతాబ్ నేతృత్వం వహించారు. చిన్నారులను బలవంతంగా పనిలో దింపడాన్ని, బాలల అక్రమ రవాణాను అడ్డుకోవాలంటే ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కమిటీ అభిప్రాయపడింది. రాష్ట్ర ప్రభుత్వాలతో, ఈ అంశానికి సంబంధించిన వారితో విస్తృత చర్చలు జరిపిన కమిటీ తన నివేదికలో పలు విషయాలను ప్రస్తావించింది. చిన్నారులను కార్మికులుగా పెట్టుకుంటున్న యజమానులపై ఎన్నిసార్లు జరిమానాలు విధించినప్పటికీ వారు ఆ పిల్లలను మరోసారి అదే పనిలో పెట్టుకుంటున్నారని తెలిపింది. యజమానులపై, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా మరిన్ని కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. జరిమానాలను మూడు నాలుగు రెట్లు పెంచడంతో పాటు లైసెన్సుల రద్దు, ఆస్తుల జప్తు వంటి కఠిన శిక్షలు విధించాలని సిఫారసు చేసింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా మంత్రిత్వ శాఖ నుంచి సేకరించిన సమాచారాన్ని కమిటీ తన నివేదికలో ఉటంకించింది. వివిధ రంగాలలో 1.01 కోట్ల మంది పిల్లలు పని చేస్తున్నారని తెలిపింది. ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన బాల కార్మికుల సంఖ్య 2011 జనాభా లెక్కల ప్రకారం 57,54,201గా ఉంది. వీరంతా 5-14 సంవత్సరాల మధ్య వయసున్న వారే. వీరు వ్యవసాయం, మైనింగ్‌తో పాటు ఎనిమిది రకాల పరిశ్రమలలో పని చేస్తున్నారు.

పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన బాధ్యత ఎవరిది?

- ఇది కేంద్రం వైఫల్యమే : సామాజిక కార్యకర్తలు

న్యూఢిల్లీ : పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఇద్దరు వ్యక్తులు లోక్‌సభలోకి ప్రవేశించి అలజడి సృష్టించిన విషయం ఇప్పటికీ షాక్‌కు గురి చేస్తున్నది. కొత్త పార్లమెంటు భవనంలో సమావేశాల సందర్భంగా చోటు చేసుకున్న ఈ పరిణామం యావత్‌దేశాన్ని విస్మయానికి గురి చేసింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టమూ చోటు చేసుకోకపోయినప్పటికీ.. జరిగిన తీరు మాత్రం ఆందోళన కలిగించేదేనని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఇందులో కేంద్రం వైఫల్యం పూర్తిగా కనబడుతున్నదనీ, ఈ విషయంలో మోడీ సర్కారు బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

పార్లమెంటుపై దాడి ఘటనకు సంబంధించి మనోరంజన్, సాగర్ శర్మ, నీలం, అమోల్ షిండే, మహేష్ కుమావత్, లలిత్ ఝా అనే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వారే కావటం గమనార్హం. కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద సాగు చట్టాలు, మణిపూర్ సంక్షోభం, నిరుద్యోగం సహా అనేక అంశాలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో వీరు పాల్గొన్నట్టు సమాచారం ఉన్నది. ఈ అంశాలే వారి ప్రస్తుత చర్యకు పురిగొల్పిందని తెలుస్తున్నది.

ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ సాగుతున్నది. నిందితులపై పోలీసులు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను పార్లమెంట్ భద్రతకు సంబంధించిన ఎనిమిది మంది సిబ్బందిని సస్పెండ్ చేశారు. అత్యంత పటిష్టమైన భద్రత ఉండాల్సిన పార్లమెంటులో ఈ వైఫల్యం కేంద్రం తప్పిదమేనని ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఈ విషయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నూతన క్రిమినల్ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్ట్ (ఈఎ)ల స్థానంలో పార్లమెంటులో కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత - 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత - 2023, భారతీయ సాక్ష్య సంహిత-2023 బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారంనాడు ఆమోదముద్ర వేశారు. దీంతో ఈ బిల్లులు చట్టరూపం దాల్చాయి. బ్రిటిష్ కాలంనాటి ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన మూడు బిల్లులు ఇటీవల జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో మూజువాణి ఓటుతో ఉభయసభల ఆమోదం పొందాయి.

పట్టాలుతప్పిన అజ్మీర్-సిల్దా ఎక్స్‌ప్రెస్ రైలు..

- తృటిలో తప్పిన ముప్పు

అజ్మీర్: రాజస్థాన్‌లోని అజ్మీర్ నగర సమీపంలో తటిలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. సేఫ్టీ బ్రేకులు పట్టేయడంతో అజ్మీర్-సిల్దా ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పి పక్కకు దూసుకెళ్లింది. మొత్తం నాలుగు బోగీలు పట్టాల పైనుంచి పక్కకు వెళ్లాయి. సోమవారం ఉదయం 8 గంటలకు మదర్ రైల్వే యార్డ్ దగ్గర ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. పట్టాలు తప్పిన నాలుగు బోగీలు బోల్తాపడితే ఘోరం జరిగేదని, బోల్తా పడకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని నార్త్-వెస్టర్న్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శశికిరణ్ చెప్పారు. ప్రస్తుతం రైల్వే అధికారులు, డీఆర్‌ఎం ఘటనా స్థలంలో ఉన్నారని, పట్టాలు తప్పిన నాలుగు బోగీలను తిరిగి ట్రాక్ పైకి ఎక్కించే పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఎవరికీ ఎలాంటి గాయాలు గానీ కాలేదని తెలిపారు.

అప్రూవర్‌గా మారేందుకు అనుమతివ్వండి

- న్యూస్‌క్లిక్ కేసులో హెచ్‌ఆర్ హెడ్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ కేసులో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. అప్రూవర్‌గా మారేందుకు అనుమతి ఇవ్వాలంటూ న్యూస్‌క్లిక్ మానవ వనరుల అధిపతి అమిత్ చక్రవర్తి ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. చైనాకు అనుకూలంగా కథనాలు రాసేందుకు బీజింగ్ నుంచి నిధులు అందుతున్నాయన్న ఆరోపణలపై న్యూస్‌క్లిక్‌పై ఉపా చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసును ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. న్యూస్‌క్లిక్ ప్రధాన సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్తా, అమిత్ చక్రవర్తిలను ఇప్పటికే అరెస్టు చేశారు. అప్రూవర్‌గా మారేందుకు అనుమతి ఇవ్వాలని అమిత్ చక్రవర్తి ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. తన దగ్గర ఉన్న సమాచారాన్ని పోలీసులకు వెల్లడిస్తానని కోర్టులో దాఖలు చేసిన దరఖాస్తులో పేర్కొన్నాడు. అమిత్ వాంగ్మూలాన్ని రికార్డు చేసేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది.

ఉల్లిపాయలతో శాంతాక్లాజ్

- 'క్రిస్మస్' సందర్భంగా సుదర్శన్ పట్నాయక్ సైకత శిల్పం

భువనేశ్వర్ : క్రిస్మస్ సందర్భంగా సైకత శిల్పకారుడు సుదర్శన్ పట్నాయక్ శాంతాక్లాజ్ సైకత శిల్పాన్ని రూపొందించారు. 'గిఫ్ట్ ఎ ప్లాంట్, గ్రీన్ ద ఎర్త్' అనే సందేశంతో పూరీలోని బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో ఉల్లిపాయలను ఉపయోగించి శాంతాక్లాజ్ ఇసుక శిల్పాన్ని రూపొందించారు. ఈ భారీ శిల్పాన్ని తయారు చేయటానికి ఆయన రెండు టన్నుల ఉల్లిపాయలను ఉపయోగించారు. "ప్రతి సంవత్సరం క్రిస్మస్ సందర్భంగా మేము పూరీలోని బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో కొన్ని విభిన్న శిల్పాలను రూపొందించడానికి ప్రయత్నిస్తాము. ఈసారి మేము ప్రపంచంలోనే అతిపెద్ద ఉల్లి, ఇసుకతో కూడిన శాంతా క్లాజ్‌ను రూపొందించాం. ఇది 100 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తు, 40 అడుగుల వెడల్పు ఉంటుంది" అని సుదర్శన్ పట్నాయక్ చెప్పారు. ఈ సైకత శిల్పంతో చెట్లను నాటడం ఆవశ్యకతను కూడా ఆయన వివరించాడు. ఈ ఆకారణంగానే శాంతాక్లాజ్‌ను రూపొందించటం కోసం ఉల్లిపాయలను ఉపయోగించినట్టు తెలిపారు.

కప్పేస్తున్న పొగ మంచు

- విమానయానానికి అంతరాయం
- యుపిలో 10 వాహనాలు ఢీ

న్యూఢిల్లీ : ఉత్తరభారతాన్ని చలి పులి వణికిస్తుంది. దేశ రాజధాని ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. దేశరాజధాని ప్రాంతంలో సోమవారం ఉష్ణోగ్రతలు 9.4 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. దీంతోపాటు దట్టంగా పొగ కమ్మేసింది. దట్టమైన పొగ మంచు కారణంగా విజిబిలిటీ సరిగా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారత వాతావరణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరాదిలో అనేక ప్రాంతాల్లో విజిబిలిటీ జీరోకి పడిపోయింది. ఢిల్లీలోని పాలెం విమానాశ్రయం, అమృత్‌సర్, ఆగ్రా, గ్వాలియర్, ప్రయాగ్‌రాజ్, జైసల్మేర్ విమానాశ్రయాల్లో విజిబిలిటీ 0 మీటర్లకు పడిపోయింది. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితులు జాతీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు తీవ్ర ప్రభావం పడింది. దట్టమైన పొగ మంచు కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా.. మరికొన్నింటిని దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. అలాగే దట్టమైన పొగ మంచు కారణంగా ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఢిల్లీకి సుమారు 86 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాపూర్‌లోని హాఫీజ్‌పూర్ కొత్వాలి ప్రాంతంలో సుమారు 10 వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హపూర్-బులంద్‌షహర్ హైవేపై సోమవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పొగ మంచుకారణంగా సుమారు 10 వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ప్రమాదం నేపథ్యంలో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో దెబ్బతిన్న కార్లను క్రేన్ సాయంతో పోలీసులు అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

ఈ సారి ఆ తప్పు చేస్తే నియంతత్వమే..

- ఉద్ధవ్ సంచలన వ్యాఖ్యలు..

ముంబయి: శివసేన(యుబిటి) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే 2024 ఎన్నికల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం నియంతత్వం ముందు ఉందని, మళ్లీ ఆ తప్పు (బిజెపిని ఎన్నుకోవడం) చేస్తే దేశంలో ఇక నియంతృత్వమే అని అన్నారు. భారతదేశ స్వేచ్ఛను రక్షించే సమయం ఆసన్నమైందని అన్నారు. తూర్పు ముంబైలోని కుర్లాలో సోమవారం జరిగిన ఒక సమావేశంలో జైన్ కమ్యూనిటీని ఉద్దేశించి మాట్లాడుతు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశం ప్రసుత్తం గడ్డుకాలం ఎదుర్కొంటోందని, ఈ సారి మనం తప్పు చేస్తే దేశం నియంతత్వంలోకి వెళ్తుందని, దేశాన్ని ఎవరు కాపాడుతారని ప్రశ్నించారు. పరోక్షంగా బిజెపిని ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం కావాలని, ఒకప్పుడు స్వాతంత్ర్యం కోసం పోరాడామని, ఇప్పుడు స్వేచ్ఛ కోసం పోరాడుతున్నామని, దేశంలో గందరగోళ వాతావరణం ఉందని, నియంతత్వం మన దరిదాపుల్లో ఉందని, దాన్ని మనం ఆపాలంటూ వ్యాఖ్యానించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి పొరబాట్లను చేయవద్దని ప్రజలను కోరారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇక్కడికి రాలేదని, దేశం కోసం వచ్చానని అన్నారు.

క్రిస్మస్ రోజూ ఆగని దాడులు

- వెస్ట్ బ్యాంక్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయిల్

గాజా: ఇజ్రాయిల్ దళాలు క్రిస్మస్ రోజు కూడా గాజా, వెస్ట్ బ్యాంక్‌లపై హంతక దాడులు కొనసాగించింది. వెస్ట్‌బ్యాంక్ లోని సెంట్రల్ రీజియన్ ప్రధాన రహదారులపై ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించింది. అంబులెన్సులు, పౌర వాహనాలను లక్ష్యంగా చేసుకుని బాంబులు వేయడంతో పౌరులు ఎక్కువ మంది చనిపోయారు. సెంట్రల్ గాజాలోని అల్- మఘాజీ శరణార్థి శిబిరంపై ఆదివారం జరిపిన దాడిలో 70 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. గాజా దక్షిణ ప్రాంతంలోని యూనిస్‌పై కూడా దాడి జరిగింది. ఈ దాడులతో క్రిస్మస్ రోజున కూడా గాజా నెత్తురోడింది. అంబులెన్సులు, సహాయక బృందాల పనికి తీవ్ర విఘాతం ఏర్పడింది. అక్టోబరు 7 నుండి ఇజ్రాయిల్ జరుపుతున్న హంతక దాడుల్లో ఇంతవరకు 54, 036 మంది చనిపోయారు. మరో 20, 424 మంది గాయపడ్డారు. వీధుల్లో శిథిలాలను తొలగించడానికి, పౌరుల ఇళ్లను కూల్చివేయడానికి ఇజ్రాయిల్ ఆర్మీ బుల్డోజర్లను ఉపయోగించింది. బెత్లహాం, బీటా, నబ్లస్, హెబ్రోన్ సమీపంలోని సైర్, కర్మ, ఆక్రమిత వెస్ట్ బ్యాంకులోని పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ ఆర్మీ భీకర దాడులకు పాల్పడుతున్నది.

సెంట్రల్ గాజాలోని అల్ -మఘాజీ శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ ఆదివారం జరిపిన వైమానిక దాడుల్లో 70 మంది పాలస్తీనీయులు చనిపోయిన దృశ్యం

పవిత్రభూమిలో పనికిమాలిన యుద్ధం

- క్రిస్మస్ సందేశంలో గాజాపై ఇజ్రాయిల్ దాడులను విమర్శించిన పోప్
- మా హృదయాలు బెత్లహేంలో ఉన్నాయని ఆవేదన
- మరణించిన చిన్నారులను బాలయేసులుగా వర్ణన

వాటికన్ సిటీ : ప్రతీ ఏటా క్రిస్మస్ రోజున యావత్తు ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చే పోప్ ఫ్రాన్సిస్ ఈసారి యుద్ధాలకు వ్యతిరేకంగా పిలుపునిచ్చారు. గాజాపై ఇజ్రాయిల్ పాల్పడుతున్న కనికరం లేని దాడులను 'పవిత్రభూమిలో పనికిమాలిన యుద్ధంగా' విమర్శించారు. యుద్ధాలకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. వలస వచ్చిన ప్రజల హక్కులను సమర్థించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉక్రెయిన్, సిరియా, యెమెన్, లెబనాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్ వంటి ప్రాంతాల్లో సాగుతున్న రాజకీయ, సామాజిక, సైనిక వివాదాలకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. గాజాతో సహా వివిధ యుద్ధాల్లో చనిపోతున్న చిన్నారులను 'నేటి బాల యేసులు'గా పోప్ అభివర్ణించారు. క్రిస్మస్ రోజున వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా సెంట్రల్ బాల్కనీ నుంచి అక్కడ కింద వున్న స్క్వేర్‌లో గుమిగూడి ఉన్న వేలాది మంది ప్రజలను ఉద్దేశించి పోప్ 'ఉర్బి ఎట్ ఓర్బి' (నగరం, ప్రపంచానికి సందేశం) ప్రసంగం చేయడం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం ప్రసంగంలో ఆయుధ పరిశ్రమలపై కూడా విమర్శలు చేశారు. యుద్ధాలను ఆయుధ పరిశ్రమ నియంత్రిస్తుందని పేర్కొన్నారు. 'ఆయుధాల ఉత్పత్తి, అమ్మకాలు, వాణిజ్యం వేగంగా పెరుగుతున్నప్పుడు మనం శాంతి గురించి ఎలా మాట్లాడగలం' అని ప్రశ్నించారు. ఆయుధాల వ్యాపారంపై మరింత విచారణ జరగాలని విజ్ఞప్తి చేశారు.

'నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల్లో అనేక మంది అమాయకులు బలవుతున్నారు. మరణించిన చిన్నారులంతా బాలయేసులు' అని పోప్ అన్నారు. 'పాలస్తీనాలో దాడులతో ఆ ప్రజల జీవితాలు నాశమవుతున్నాయి. అక్కడ శాంతి రావాలి' అని తెలిపారు. మా హృదయాలు బెత్లహేంతోనే ఉన్నాయని అన్నారు. ఇజ్రాయిల్‌పై హమాస్ దాడులను కూడా పోప్ ప్రస్తావించారు.

పాలస్తీనాకు సంఘీభావంగా బెత్లెహాంలో క్రిస్మస్ వేడుకలు రద్దు

బెత్లెహాం : క్రిస్మస్ రోజున లక్షలాది మంది పర్యాటకులతో కిటకిటలాడే పవిత్ర నగరం బెత్లహామ్ ఈ సారి బోసిపోయింది. పాలస్తీనాకు సంఘీభావంగా ఏసు క్రీస్తు జన్మ స్థలమైన బెత్లెహామ్‌లో క్రిస్మస్ వేడుకలను రద్దు చేస్తున్నట్లు స్థానిక అధికారులు ప్రకటించారు.

గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణపూరిత దాడులు కొనసాగిస్తుండడాన్ని బెత్లెహాం వాసులు నిరసించారు. ఈ పరిస్థితుల్లో బెత్లహాం అంతటా ఉన్న చర్చిల నాయకులు ఈ సంవత్సరం క్రిస్మస్ వేడుకలు జరుపుకోరాదని నిర్ణయించినట్లు మేయర్ హన్నా హనానియా వివరించారు. "ఏసు జననం ప్రపంచంలోని పిల్లలందరికీ శాంతి, సుఖ సందేశాన్ని ఇవ్వాలి. కానీ, గాజాస్ట్రిప్‌లో వేలాది మంది పిల్లలు అమానుషంగా చంపబడుతున్నప్పుడు మేము క్రిస్మస్ వేడుకలను జరుపుకోలేము "అని హనానియన్ పేర్కొన్నారు.

ఆ దాడితో మాకు సంబంధం లేదు

- అమెరికా ఆరోపణలపై ఇరాన్

టెహ్రాన్: ఇటీవల అరేబియా సముద్రంలో భారత్ వైపు వస్తున్న కెమికల్ ట్యాంకర్ నౌకపై డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటన తర్వాత ఎర్రసముద్రంలో భారత్‌కి వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ అటాక్ జరిగింది. భారత్ సమీపంలో అరేబియా సముద్రంలో జరిగిన దాడి ఇరాన్ పనే అని అమెరికా ఆరోపించింది. అమెరికా ఆరోపణల్ని ఇరాన్ తోసిపుచ్చింది. ఈ ఆరోపణల్ని 'విలువ లేనివి'గా ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ సోమవారం ఖండించింది. పెంటగాన్ ఆరోపించిన తర్వాత టెహ్రాన్ నుంచి ఈ తరహా ప్రతిస్పందన వచ్చింది. అమెరికా వాదనల్ని పూర్తిగా తిరస్కరిస్తున్నామని, విలువలేనివిగా ప్రకటిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి నాసర్ కనాని అన్నారు. ఇటువంటి వాదనలతో గాజాలో నియోనిస్టు పాలన (ఇజ్రాయిల్) నేరాలను అమెరికన్ ప్రభుత్వం కప్పిపుచ్చడానికి, ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుందని ఇరాన్ చెప్పింది.

తల్లిదండ్రుల అనుమతి లేకుండా పిల్లలను శాంతా క్లాజ్ దుస్తులు ధరించనివ్వవద్దు

- మధ్యప్రదేశ్‌లో షాజాపూర్ జిల్లా విద్యా శాఖాధికారి ఆదేశాలు

భోపాల్ : తల్లిదండ్రులు అనుమతి లేకుండడా పిల్లలను శాంతా క్లాజ్ దుస్తులు ధరించనివ్వద్దని మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్ జిల్లాలో విద్యాశాఖాధికారి ఒకరు వివాదాస్పద ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రుల రాతపూర్వక అనుమతి లేకుండా విద్యార్థులు క్రిస్మస్ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు శాంతాక్లాజ్, క్రిస్మస్ ట్రీ దుస్తులు ధరించాలంటే తల్లిదండ్రులు లేదా పిల్లల సంరక్షకుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను సదరు అధికారి ఈ నెల 14న జారీ చేశారు. రాష్ట్రంలోని ఉజ్జయిని, గ్వాలియర్ జిల్లాలు కూడా ఇదే తరహా నోటీసులిచ్చాయి. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ డిసెంబర్ 13న ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు ఈ ఆదేశాలు వెలువడ్డాయి.ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు ఈ ఆదేశాలు జారీ చేసినట్టు అధికారులు తెలపటం గమనార్హం. అయితే పాఠశాలల్లో క్రిస్మస్‌కు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించకుండా ఉత్తర్వులు నిషేధించలేదని అధికారులు తెలిపారు. గతేడాది విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) మధ్యప్రదేశ్‌లోని పాఠశాలలను వారి తల్లిదండ్రుల అనుమతి లేకుండా శాంతాక్లాజ్ దుస్తులు ధరించాలని పిల్లలను అడగొద్దని హెచ్చరించింది. ప్రస్తుతం సదరు విద్యా శాఖాధికారి ఇలాంటి ఆదేశాలనే జారీ చేయటం గమనార్హం.

మీకోసం

జ్యూస్ జార్లు, గాజు పాత్రలను శుభ్రం చేసేటప్పుడు కొద్దిగా నీరు కలిపిన ఉప్పుతో రుద్ది కడిగితే గీతలు పడవు.

జీవన సౌరభం

గొప్పవాళ్లమైన తర్వాత చప్పట్లు కొట్టేవారి కంటే.. మన దగ్గర ఏమీ లేనప్పుడు వెన్ను తట్టేవాళ్లే నిజమైన స్నేహితులు.

తెలివైన చిలుక

ఒక ఊరు చివర అడవి ఉంది. ఆ అడవిలో ఒక బోయవాడు చిలుకలని పట్టి నగర వాసులకు అమ్ముతుండేవాడు. ఆ చిలుకలకు చిన్న చిన్న మాటలు కూడా నేర్పేవాడు. దీంతో అతని చిలుకల వ్యాపారం బాగా సాగేది.

ఒకసారి బోయవాడి వలలో ఒక తెలివైన చిలుక చిక్కుకుంది. దానికి అడవిని విడిచి వెళ్ళడం ఎంత మాత్రమూ ఇష్టం లేదు. విశాలమైన అడవి నుంచి ఇరుకైన పంజరంలోకి వెళ్ళడమంటే బంది ఖానాయే కదా అని అనుకుంది. ఆపద నుంచి తప్పించుకునేందుకు ఉపాయం ఆలోచించింది. బోయవాడు తనకి పెట్టిన ఆహారాన్ని కానీ, నీటిని కానీ ముట్టుకోలేదు. 'దీనికేదో జబ్బు వచ్చినట్లు ఉన్నది'. తగ్గిన తర్వాత అమ్మేదాంలే అని బోయవాడు దాన్ని ఇంటిదగ్గరే వుంచేశాడు. రోజులు గడుస్తున్నా అది ఏమీ తినకపోవడంతో చిక్కిశల్యమయింది. దాని అవతారం చూసి ఎవరూ కొనడానికి ముందుకురాలేదు. అప్పుడు బోయవాడు దానిని పంజరం నుంచి బయటకు తీసి పరిశీలించాడు. ఈ అవకాశాన్ని చిలుక ఉపయోగించుకోవాలనుకుంది. ఎక్కడ లేని సత్తువను కూడదీసుకుని 'తుర్రుమని' పారిపోయింది.

- ఇరుకుల హేమ,
9వ తరగతి,
సిరిసనగండ్ల, సిద్దిపేట జిల్లా.



భాగాలు చెప్పండి

పిల్లలూ, కింద కనిపిస్తున్న బొమ్మల్లో కొంతభాగం రంగు వేసి ఇచ్చాం. ఆ భాగాన్ని భిన్నం రూపంలో మీరు రాయాలి. ఉదాహరణకి ఒకటి ఇచ్చాం. మిగతావి మీరు ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ

అక్షయ్,
8వ తరగతి,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నడకతోనే ఆరోగ్యం

ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని బిజీ బిజీగా గడుపుతుంటారు. ఈ ఉరుకులు, పరుగుల జీవితంలో కాస్త సమయం కేటాయించి నడక ప్రారంభిస్తే క్రమేణా అనారోగ్య సమస్యలు కూడా తగ్గిపోతాయి. 'నడకే మనిషికి మంచి ఆరోగ్యం' అని పెద్దలు అంటుంటారు. వ్యాయామం చేసినా, ఆటలు ఆడినా, నడక నడిచినా, పరుగెత్తినా ఎంతోకొంత ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అయితే ఇది క్రమం తప్పకుండా ప్రతిరోజూ ఉదయమో, సాయంత్రమో జరగాల్సివుంది. తర్వాత శరీరంలో ఉండే కొవ్వు, ఇతర వ్యర్థాలు కొంతమేరకు చెమట రూపంలో పోతాయి. తద్వారా శరీరం దృఢంగానూ, ఆరోగ్యం మెరుగ్గానూ మారుతుంది. ఎక్సర్‌సైజుల్లో నడకను మించిన తేలికపాటి వ్యాయామం మరొకటి లేదు. ఏ వయస్సు వారైనా ఎప్పుడైనా ఎక్కడైనా నడకను కొనసాగించొచ్చు. దీనికోసం పైసా ఖరుచ పెట్టనక్కరలేదు. మిగతా వ్యాయామాల కన్నా సురక్షితం కూడా. నడక వల్ల బరువు తగ్గటంతోపాటు ఎన్నో ఉపయోగాలు, మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

మానసిక ఆరోగ్యం : ప్రతిరోజూ నడవటం వల్ల శరీరంలో ఉండే ఎండార్ఫిన్లు అనే హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, కంగారు వంటి సమస్యలు తగ్గుతాయి. వయస్సు మీద పడటం వల్ల వచ్చే డెమన్షియా, అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి.

కంటి వ్యాధులు దూరం : కంటికి సంబంధించిన పలు నాడులు కాళ్లలో ఉంటాయి. అందుకనే కాళ్లతో నడవటం వల్ల కంటి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. నిత్యం నడక సాగించటం వల్ల కళ్లపై అధిక ఒత్తిడి తగ్గటంతోపాటు గ్లకోమా వంటి కంటి వ్యాధులు రాకుండా ఉంటాయి.

రక్తం సరఫరాలో మెరుగుదల : ప్రతిరోజూ నడిచినా, పరుగెత్తినా గుండె సమస్యలు తగ్గుతాయి. గుండెపోట్లు వంటివి రావు. హైబీపీ, కొలెస్ట్రాల్ వంటివి కూడా తగ్గుముఖం పడతాయి. శరీరంలో రక్త సరఫరా మెరుగుపడుతుంది.

ఊపిరితిత్తుల సమస్యలు మాయం : నడవటం వల్ల శరీరం ఆక్సిజన్‌ను ఎక్కువగా గ్రహిస్తుంది. అదే ఆక్సిజన్ రక్తంలో చేరి ఊపిరితిత్తులకు చేరి శరీరం ఆక్సిజన్‌ను గ్రహిస్తుంది. ఆక్సిజన్ ఊపిరితిత్తుల్లో ఉండే టాక్సిన్లు, విష, వ్యర్థ పదార్థాలను బయటకు పంపుతుంది. ఇతర ఊపిరితిత్తుల సమస్యలు కూడా దూరమవుతాయి.

మధుమేహం నియంత్రణ : మధుమేహం ఉన్న వారు నిత్యం నడిస్తే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఆరునెలలపాటు క్రమం తప్పకుండా నడక లేదా పరుగు చేసిన కొందరు మధుమేహ రోగులను పరిశీలించగా వారి రక్తం స్థాయిలో గ్లూకోజ్ స్థాయిలో బాగా అదుపులోకి వచ్చినట్లుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. అందువల్ల రోజూ నడిస్తే మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవచ్చు.

జీర్ణప్రకియలో మెరుగుదల : ప్రతిరోజూ కనీసం 30 నిముషాలపాటు నడిస్తే పెద్ద పేగు క్యాన్సర్ వచ్చే ముప్పుచాలా తగ్గుతుంది. జీర్ణప్రకియ మెరుగుపడుతుంది. మలబద్ధకం పోతుంది. విరేచనం రోజూ సాఫీగా అవుతుంది. ప్రతిరోజూ 100 నిముషాల పాటు వాకింగ్ చేస్తే అధిక బరువు నుంచి కొంతవరకు తగ్గుతారని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కండరాలు కూడా దృఢంగా మారుతాయి.

ఎముకల్లో సాంద్రత పెరుగుదల : ప్రతిరోజూ నడవటం వల్ల కీళ్లు బాగా పనిచేస్తాయి. త్వరగా అవి అరిగిపోవటం జరగదు. ఎముకల్లో సాంద్రత కూడా పెరుగుతుంది. ఫ్రాక్చర్లు, కీళ్ల నొప్పులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. దీనికోసం రోజూ కనీసం 30 నిముషాలపాటైనా నడవాలి. ఇలా చేస్తే కీళ్ల నొప్పులు, వాపులు కూడా తగ్గుతాయి.

ఊబకాయం నుంచి విముక్తి : మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు ఊబకాయానికి దారితీస్తున్నాయి. చిన్నపిల్లల దగ్గర నుంచి ముసలి వారి వరకూ దీని బారిన పడుతున్నారు. బరువు తగ్గించుకోవటానికి మించిన వ్యాయామం లేదు. ఒక పౌండు బరువు పెరగటం అంటే అదనంగా 3500 క్యాలరీలు శరీరంలో వచ్చి చేరాయన్న మాటే. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నడిస్తే వారంలో ఒక పౌండు బరువు తగ్గే అవకాశం ఉంది.

క్యాబేజీ.. ఎంతో మేలు..

ఈ కాలంలో క్యాబేజీ విరివిగా దొరుకుతుంది. నీటి శాతం ఎక్కువగా ఉన్న క్యాబేజీని ఈ మధ్య ఎక్కువమంది డైట్‌లో వాడుతున్నారు. అయితే చాలా మంది వాసన వస్తుందని తినటానికి అస్సలు ఇష్టపడరు కానీ క్యాబేజీ మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. పోషకాలు ఎక్కువగా ఉండే దీన్ని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శీతాకాలం ఎదురయ్యే ఎన్నో సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

- క్యాబేజీలో పాలీఫెనాల్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉన్నాయి.
- క్యాబేజీ నీటిలో ఇండోల్–3 కార్బోనైట్ అని పిలువబడే యాంటీఆక్సిడెంట్ ఉండటం వలన కాలేయం ఆరోగ్యంగా మెరుగవుతుంది.
- బరువు తగ్గటానికి, కంటి సమస్యలను తగ్గించడంలో క్యాబేజీ బాగా ఉపయోగపడుతుంది.
- రోగ నిరోధక శక్తి మెరుగు పడుతుంది.
- ఇన్ఫెక్షన్స్ రాకుండా శరీరాన్ని కాపాడుతుంది.
- చర్మం మృదువుగా కాంతివంతంగా మెరుస్తుంది..
- చర్మం పొడిబారకుండా ఉంటుంది.
- ఇందులో ఉండే కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం ఎముకలకు అవసరమైన బలాన్ని అందిస్తాయి.
- రక్తహీనత సమస్య తగ్గడమే కాకుండా రక్త సరఫరా బాగుంటుంది.
- శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించి బరువు తగ్గటానికి సహాయపడుతుంది.
- క్యాబేజీ ఉడకబెట్టిన నీటిని తాగితే జీర్ణాశయంలో, పేగుల్లో పుండ్లు ఏర్పడకుండా నివారిస్తుంది.
- గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కూడా తొలగిపోతాయి..

పట్టు చీరల ఇస్త్రీ ఇలా

బట్టలు ఇస్త్రీ చేసుకునేటప్పుడు, అన్ని బట్టలు ఒక ఎత్తు అయితే.. పట్టు చీరలు మరో ఎత్తులా చేసుకోవాలి. పట్టు చీరలు ఎప్పటికీ కొత్తగా కనిపించాలంటే ఇస్త్రీ చాలా ముఖ్యం.

- చీరలు కొనేటప్పుడే వాటిని ఇస్త్రీ చేయవచ్చో లేదో తెలుసుకోవాలి. అలాగే ఇస్త్రీ చేసేటప్పుడు చీరపై కాటన్ వస్త్రం ఉంచి చేయాలి. ఇలా చేస్తే, వేడికి కాలిపోకుండా ఉంటాయి.
- ఐరన్ బాక్స్ మోడ్స్‌ని మార్చుకోకుండా ఇస్త్రీ చేయవద్దు. అలాగే ముందుగా చీర అంచులను ఇస్త్రీ చేయాలి. ఆ తర్వాతే చీర మధ్యలో చేయాలి. ఇలా చేస్తే ముడతలు చక్కగా పోతాయి.
- ఐరన్ చేయగానే వెంటనే మడతలు పెట్టకూడదు. హ్యాంగర్‌కు వేలాడదీయాలి. వెంటనే మడత పెడితే ముడతలు వచ్చేస్తాయి.



రంగవల్లి

పి.కస్తూరి జానకి,
దుర్గాపురం,
విజయవాడ.

16 చుక్కలు 16 వచ్చేవరకు
(16 వరుసలు)

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496



క్లాస్ లుక్‌లో మహేష్

మహేష్ బాబు నటిస్తున్న 'గుంటూరు కారం' చిత్రం నుండి తాజాగా క్రిస్మస్ రోజు ఆయన లుక్ విడుదలచేశారు. త్రివిక్రమ్, మహేశ్ బాబు కాంబినేషన్లో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రతి పోస్టర్లో మహేష్ మాస్ లుక్‌లో కనిపించారు. కానీ ఈసారి విడుదలైన లుక్‌లో మాత్రం మహేష్ బాబును క్లాస్‌గా చూపించారు.

మరింత అద్భుతంగా సలార్-2

ప్రభాస్

'సలార్ కథ నాకెంతో నచ్చింది. అందుకే విన్న వెంటనే అంగీకరించాను. నా కెరీర్‌లో చేసిన భిన్నమైన పాత్రల్లో ఇదొకటి. ఎంతో సవాల్‌తో కూడుకుంది. బాహుబలి నా కెరీర్‌కు ఒక బెంచ్‌మార్క్‌ను క్రియేట్ చేసింది' అని హీరో ప్రభాస్ అన్నారు. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఆయన నటించిన సలార్ ఈనెల 22న విడుదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభాస్ హాలీవుడ్ మీడియాతో మాట్లాడారు. 'బాహుబలి తర్వాత ఎంచుకున్న సినిమాలన్నింటిలోనూ కొత్తదనం ఉండేలా చూసుకుంటున్నా. అందులో భాగంగానే సలార్‌కు ఓకే చెప్పాను. ప్రేక్షకులు కూడా వైవిధ్యమైన కంటెంట్‌ను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం ప్రపంచమంతా భారతీయ చిత్రాల గురించే చర్చించుకుంటోంది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అని కాకుండా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అని గుర్తిస్తున్నారు. రాజమౌళి, ప్రశాంత్‌నీల్ వంటి దర్శకులతో పనిచేయటం అద్భుతమైన అనుభూతి. సలార్ పార్ట్ 1 షూటింగ్ ఆఖరిలోనే పార్టు 2 ఉంటుందని ప్రకటించాం. రెండోది మరింత అద్భుతంగా ఉంటుంది' అని వివరించారు.

సరికొత్తగా బాలకృష్ణ సినిమా

- బాబీ

'భగవంత్ కేసరి సినిమా తర్వాత వస్తున్న మా సినిమా వేరే లెవల్‌లో ఉంటుంది. ఇటీవల ఊటీలో ఒక భారీ యాక్షన్ షెడ్యూల్‌ను పూర్తిచేశాం. మరో షెడ్యూల్ కోసం రాజస్తాన్ వెళ్లనున్నాం. ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ వచ్చే ఏడాదిలో ప్రకటిస్తాం' అని దర్శకుడు బాబీ వెల్లడించారు. రెగ్యులర్ షూటింగ్ జరుగుతున్న ఈ సినిమా గురించి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విషయాలపై ఆయన పైవిధంగా స్పందించారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన చిత్రబృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. 'బ్లడ్ బాత్‌కు బ్రాండ్ నేమ్...వయొలెన్స్‌కు విజిటింగ్ కార్డ్' అనే క్యాప్షన్ పోస్టర్‌లో ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. కేరళ నటుడు దుల్కర్ సల్మాన్ నటిస్తున్నారనీ, హీరోయిన్ తమన్నా ఓ ప్రత్యేక పాటలో నటించనున్నట్లుగా కూడా ప్రచారం సాగుతోంది. ఎన్‌బికె 109 టైటిల్ ఉంటుందనే ఊహాగానాలపైన కూడా చిత్రబృందం స్పందించలేదు.

మరో రీమేక్!

మోహన్ లాల్ హీరోగా నటించిన 'నేరు' మూవీ డిసెంబర్ 21న మలయాళంలో విడుదలై ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్‌ని అందుకుంది. సలార్, డంకీ లాంటి పెద్ద సినిమాలు పోటీలో ఉన్నప్పటికీ కంటెంట్ పైన నమ్మకంతో ఈ సినిమాని విడుదల చేశారు. సినిమా అంతా కోర్ట్ రూమ్ డ్రామాగా సాగుతుంది. ఈ సినిమాని దృశ్యం సిరీస్‌ని డైరెక్ట్ చేసిన జీతూ జోసెఫ్ తెరకెక్కించారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని వెంకటేష్‌తో తెలుగు రీమేక్ చేయాలని జీతూ భావిస్తున్నారు. ఒకసారి సినిమా చూడమని కూడా వెంకటేష్‌కి ఆయన సూచించినట్లు తెలుస్తోంది. ఒకవేళ వెంకీకి సినిమా నచ్చితే కచ్చితంగా దీన్ని తెలుగులో రీమేక్ చేసే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

నల్లగా ఉన్నానన్నారు

రోషన్ కనకాల హీరోగా పరిచయమవుతోన్న చిత్రం 'బబుల్‌గమ్'. రవికాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబర్ 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోషన్ తనపై వచ్చిన ట్రోల్స్ గురించి మాట్లాడారు. 'నల్లగా ఉన్నాడు. వీడు హీరో ఏంటి', 'వీడు హీరో మెటీరియల్ కాదు' ఇలా నా గురించి మాట్లాడుకోవడం నేను విన్నాను. నా వెనుక ఇలాంటివి మాట్లాడుతూ ట్రోల్ చేశారు. నేను ఇలాగే పుట్టాను. ఇలాగే ఉంటాను. ఒక మనిషి అందం రంగులో ఉండదు. అతడి సక్సెస్‌ను నలుపు, తెలుపు నిర్ణయించవు. అతడి ప్రతిభ, క్రమశిక్షణ, సినిమా కోసం అతడు పడిన కష్టం మాత్రమే విజయాన్ని అందిస్తాయి' అని రోషన్ చెప్పారు.

వెంకీ రీరిలీజ్ చాలా సంతోషం : స్నేహ



హీరో రవితేజతో కలిసి తాను నటించిన సూపర్‌హిట్ మూవీ 'వెంకీ' మరోసారి విడుదల చేయటం సంతోషంగా ఉందని హీరోయిన్ స్నేహ వెల్లడించారు. 20 ఏళ్ల క్రితం విడుదలై, ప్రేక్షకులకు వినోదం పంచిన ఈ సినిమాను ఈ నెల 30న రీరిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా స్నేహ స్పందిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు.

రోహిత్ సేన సాధించేనా..

- నేటినుంచి దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్
- కోహ్లి, రోహిత్ చేరికతో భారత్ బలోపేతం
- పేసర్లకు స్వర్గధామం
- మ.1.30గం॥లకు ప్రారంభం

సెంచూరియన్: దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత జట్టు ఇప్పటికే టి20, వన్డేల సిరీస్‌లను చేజిక్కించుకున్న హుషారులో ఉంది. అదే ఊపుతో టెస్టుల్లోనూ బరిలోకి దిగుతోంది. దక్షిణాఫ్రికా పర్యటనకు వేర్వేరు జట్లను పంపిన బిసిసిఐ వ్యూహం ఫలించింది. యువ క్రికెటర్లతో కూడిన టీమిండియా టి20 సిరీస్‌ను 2-1తో, సీనియర్, యువ క్రికెటర్లతో కూడిన టీమిండియా వన్డే సిరీస్‌నూ 2-1తో చేజిక్కించుకుంఇ. ఇక టెస్టుల్లో సీనియర్లందరూ చోటు దక్కించుకొని రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. వన్డే ప్రపంచకప్ తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తొలిసారి బ్యాట్‌లు పట్టనున్నారు. దక్షిణాఫ్రికా గడ్డపై భారత పురుషుల జట్టు ఇప్పటివరకు టెస్ట్ సిరీస్‌ను గెలిచిన దాఖలాలు లేవు. ఈ గడ్డపై ఇప్పటివరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక జట్లు మాత్రమే సఫారీ జట్టు సిరీస్‌ను సాధించాయి. దీంతో భారత్‌కు ఇప్పటివరకు అందని ద్రాక్షగా ఉన్న సఫారీ గడ్డపై సిరీస్‌ను చేజిక్కించుకోవాలన్న దృఢ నిశ్చయంతో బరిలోకి దిగుతోంది. ఇక్కడి పిచ్‌లో పేస్‌కు అనుకూలిస్తాయి కాబట్టి నలుగురు పేసర్లతో బరిలోకి దిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దక్షిణాఫ్రికా గడ్డపై 23 టెస్టులాడిన టీమిండియా కేవలం నాలుగింట్లో మాత్రమే విజయం సాధించింది. గతంలో సఫారీ పర్యటనకు మహ్మద్ షమీ 43.83సగటుతో ఆరు వికెట్లు తీసాడు. ఈసారి చీలమండ గాయం కారణంగా షమీ ఈ సిరీస్‌కు దూరం కావడం పెద్ద లోటే.

ఇక దక్షిణాఫ్రికా విషయానికొస్తే.. ఈ సిరీస్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్ వీడ్కోలు పలుకుతున్నట్లు స్టార్ బ్యాటర్ డీన్ ఎల్గర్ ఇప్పటికే ప్రకటించాడు. దీంతో ఈ సిరీస్ చేజారకుండా అతడిని గౌరవంగా సాగనంపాలన్న దృఢనిశ్చయంతో దక్షిణాఫ్రికా జట్టు ఉంది. అలాగే చీలమండ గాయం నుంచి కగిసో రబడా కోలుకొని తిరిగి జట్టులో చేరాడు. దీంతో సఫారీ జట్టు బౌలింగ్ విభాగం పటిష్టంగా తయారైంది. అనుభజ్ఞుడైన రబడా సొంతగడ్డపై చెలరేగడం ఖాయం. వన్డే ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికాజట్టు కెప్టెన్‌గా ఉన్న బవుమా వన్డే, టి20ల్లో చోటు దక్కించుకోలేక పోయినా.. తిరిగి టెస్టుల్లో పగ్గాలు అందుకున్నాడు. అన్ని విభాగాల్లో దక్షిణాఫ్రికా ఫీల్డర్లు రాణిస్తే భారత్‌కు కష్టాలు తప్పవు.

మెరుగైన రికార్డుతో కోహ్లి...

సఫారీ గడ్డపై మెరుగైన బ్యాటింగ్ రికార్డు ఉంది ఒక్క విరాట్ కోహ్లికి మాత్రమే. అతడు ఆ జట్టుపై 49.29సగటును కలిగి ఉన్నాడు. ఇక రోహిత్ శర్మ 46.54సగటు కలిగి ఉన్నా ఇక్కడ క్రీజ్‌లో నిలదొక్కుకోవడం కష్టమే. శుభ్‌మన్ గిల్, జైస్వాల్, శ్రేయస్ అయ్యర్‌కు ఇదే తొలి దక్షిణాఫ్రికా సిరీస్.

జట్లు..

భారత్: రోహిత్(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, కోహ్లి, శ్రేయస్, కెఎల్ రాహుల్, జడేజా, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, ప్రసిధ్ కృష్ణ/అశ్విన్.

దక్షిణాఫ్రికా: బవుమా(కెప్టెన్), ఎల్గర్, మార్‌క్రమ్, జోర్జి, బెర్గిగ్హామ్, వెర్రియనే, జాన్సెన్, కేశవ్ మహరాజ్, కోర్జి, రబడా, ఎన్గిడి.

ఆసీస్‌తో వన్డే, టి20లకు మహిళాజట్లను ప్రకటించిన బిసిసిఐ

ముంబయి: ఏకైక టెస్ట్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా మహిళల జట్టు ఇక ఆస్ట్రేలియాతో వన్డే, టి20 సిద్ధమౌతోంది. ఈ క్రమంలో ఆసీస్‌తో తలపడే భారత మహిళల జట్లను భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) సోమవారం ప్రకటించింది. 15మంది ఆటగాళ్ల జట్టుకు రెండు ఫార్మాట్‌లకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన ఎంపికయ్యారు. ముంబయిలోని వాంఖడే వేదికగా వన్డే సిరీస్, నయా ముంబయిలోని డివైపాటిల్ వేదికగా టి20 సిరీస్ జరగనున్నాయి. ఇరుజట్ల మధ్య మూడు వన్డేల, మరో మూడు వన్డేల టి20 సిరీస్ జరగనున్నాయి. తొలి వన్డే ఈనెల 28న జరగనుండగా.. ఏకైక టెస్ట్‌లో ఆసీస్‌ను 8వికెట్ల తేడా చిత్తుచేసిన ఉత్సాహంతో బరిలోకి దిగనుంది.

సిరీస్..

వన్డేలు..	టి20లు..
డిసెంబర్ 28 : తొలి వన్డే	జనవరి 5 : తొలి టి20
డిసెంబర్ 30 : రెండో వన్డే	జనవరి 7 : రెండో టి20
జనవరి 2 : మూడో వన్డే	జనవరి 9 : మూడో టి20

ఎమర్జింగ్ టెన్నిస్ విజేత యమ్లపల్లి

సోలాపూర్: సోలాపూర్ ఓపెన్ మహిళల ఐటిఎఫ్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను 23ఏళ్ల సహజ యమ్లపల్లి కైవసం చేసుకుంది. ఎంఎస్–ఎల్‌టిఏ టెన్నిస్ సెంటర్‌లో జరిగిన ఫైనల్లో 7వ ర్యాంకర్ యమ్లపల్లి 6–4, 6–3తో 2వ ర్యాంకర్, రియో ఒలింపిక్స్ మహిళల డబుల్స్ విజేత ఎక్టేరినా మకోరోవా(రష్యా)ను చిత్తుచేసింది. ఏటిపి సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో యమ్లపల్లి 412వ స్థానంలో ఉండగా.. ఎక్టేరినా 186వ ర్యాంకర్. విజేతగా నిలిచిన యంలపల్లికి 25వేల డాలర్ల ప్రైజ్‌మనీ లభించింది. అలాగే వచ్చేవారం ప్రకటించే ఏటిపి మహిళల ర్యాంకింగ్స్‌లోనూ 72స్థానాలు మెరుగుపరుచుకొని ఏకంగా 340వ స్థానంలో నిలవనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68